శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!  సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



శ్రీరామనవమి సంచిక

# గురుకృప

పరహితమే పరమధర్మం

# గురుపూర్ణిమ ఎందుకు చేసుకోవాలి?



గురుపూర్ణిమను ఎందుకు చేసుకోవాలి? గురుపూర్ణిమ యొక్క ప్రాశస్త్యం ఏమిటి? గురుపూర్ణిమ అనేటువంటిది ఎందుకు చేసుకోవాలి అనేది ఎక్కువ మందికి తెలియదు. కాని చిత్రమేమిటంటే ఎప్పుడూ ఏ పండుగనూ చేసుకోమని చెప్పనటువంటి బాబా, ఒక్క గురుపూర్ణిమను మాత్రమే చేసుకోమని చెప్పారు.

అసలు ఈ పండుగలు ఎట్లా వచ్చాయి? అసలు అవి ఎందుకు మనం చేసుకోవాలి? గురుపూర్ణిమనైనా ఎందుకు చేసుకోవాలి? మామూలుగా మనకుండేటువంటి పండుగలలో రెండు రకాలుంటాయి. ఒకటి ఆధ్యాత్మికంగా మన మనసు అంతర్ముఖ మవటానికి దోహదం చేసేటువంటి కాలాన్ని పండుగలు క్రింద నిర్ణయించారు మన మహర్షులు. ఇది దేనిమీద నిర్ణయమై ఉంటుంది అని అంటే, ఖగోళశాస్త్ర ప్రకారంగా నిర్ణయమై ఉంటుంది. సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, ఈ గ్రహగతుల యొక్క ప్రభావం మన మనస్సు మీద ఎట్లా ఉంటుంది అనే దానిని చూసుకొని, ఏఏ కాలంలో ఆ ప్రభావం మన మనస్సు అంతర్ముఖమై ప్రశాంతంగా, నిర్మలంగా ఉండటానికి అవకాశం ఉంటుందో, ఆ తిథులు, ఆ దినాల్ని చూచి, ఇక్కడ మీరు ఈ రోజున ఈ రకంగా అంతర్ముఖం అవ్వడానికి సులభంగా ఉంటుంది. అట్లాగే గ్రహాల ప్రభావం మనకు అనుకూలంగా ఉన్నది అనుకున్నప్పుడు మనం మనస్సనేటువంటి తెరచాపనెత్తినట్టయితే - మనం మన గమ్యంవైపుకి త్వర, త్వరగా పోతాము. ఇవి ఒక రకమైన పండుగలు.

శిరిడీలో శ్రీరామనవమి జరుగుతుంది పండుగగా. అది బాబా చెప్పి చేయించిన పండుగ కాదు. శ్రీరామనవమి ఇక్కడ మామూలుగానే ప్రాశస్త్యంగా ఉంది కనుక ఆ రోజున భక్తులందరూ కలిసి శ్రీరామనవమిని సెలబ్రేట్ చేసుకున్నారు. అందరూ ఉత్సవంగా చేసుకున్నారు. ఆ ఉత్సవాన్ని ఆయనేం కాదనలేదు. ముస్లిమ్స్ వచ్చి ఉరుసు చేసుకున్నారు. దాన్ని ఏమీ కాదనలేదు ఆయన. కానీ ఆయనకై ఆయన చెప్పినటువంటి పండుగ మాత్రం "గురుపూర్ణిమ" ఒక్కటే.

సాయిభక్తులకు బాబానే 'సద్గురువు'. బాబానే 'దైవం'. ఆయనే 'మార్గం'. కాబట్టి ఆయన చెప్పినటువంటి పండుగ ఏదైతే ఉన్నదో అదొక్కటే సాయిభక్తులకు పండుగ. సాయిభక్తులకు ప్రధానమైన పండుగ ఏమిటి అనంటే ఆయన చెప్పినటువంటి "గురుపూర్ణిమ".

మనం చేసుకోవాల్సిన పండుగ ఏమిటంటే ఆయన మహాసమాధి రోజు. ఆయన దేదీ తెలియదు గనుక, ఆయన ఎప్పుడు పుట్టారో, ఆయన జన్మదినం ఏమిటో తెలియదు గనుక ఆయన మహా సమాధి తెలుసు గనుక విజయదశమి ఆయన మహాసమాధి రోజు అని మనం అదొక్కటి చేసుకోవాలి. ఈ రెండే రెండు పండుగలు మనకు.

(మిగతా భాగం పేజీ నెం. 27లో)

సంపుటి : 17
ఏప్రియల్ 8

సంచిక : 2
2014

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

మాధ(న)వ సేవ 4
– గురుకృప

దర్శనం 7
– శరశ్చంద్రికలు

అన్వేషణ 13
– శరశ్చంద్రికలు

అడ్డంకులు లేని ప్రేమ 19
– శరశ్చంద్రికలు

ఎదుటివారి స్థానంలో నిలబడి చూడు! 25
– పార్థసారధి ప్రవచనాలు

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# మాధ(న)వ సేవ

మానవుడు... మాధవుడు... మనసున్న వాడు మనిషి అయితే... పరిపూర్ణుడైన వాడు మాధవుడయ్యాడు. ద్వైదీ భావనలో ఉన్నవాడు మానవుడైతే, ఏకత్వంలో నిలిచిన వాడు మాధవుడయ్యాడు. కరుణకు పరిమితమైనవాడు మానవుడైతే.. ప్రేమకు ప్రతిరూపమైనవాడు మాధవుడయ్యాడు... వ్యాజమునకు (కారణము) పట్టుబడినవాడు మానవుడైతే.... అవ్యాజమునకు కట్టుబడినవాడు మాధవుడయ్యాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు, ఉపమానాలు. "మనిషి (మాధవుడిగా, పరిపూర్ణుడిగా) దైవంగా ఎదగడం బాబా మతం" అంటారు శ్రీబాబూజీ. నిజానికి భరతవర్షంలో తప్పు ఇంకెక్కడా ఇలాంటి అత్యున్నత స్థితి అందుకోవచ్చునన్న అభ్యుదయభావం, అందుకు తగ్గ మార్గం, మార్గదర్శులు లేరని విశ్వాసం. మనిషి దైవంగా ఎదగడమన్నది - ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరగలగడమన్నది సాధ్యమే నన్నది భరతవర్షానికి మాత్రమే చెల్లింది. ఈ జగత్తంతా తానుగానే, ప్రతి జీవి తననుగానే భావించిన మనిషి మాధవుడే అయ్యాడు. మాధవుడిగా మారిన మనిషి - పరోపకారార్ధం వసించడం మొదలిడిననాడు మానవసేవ - మాధవుని సేవే అయ్యింది.

**పరోపకార పరాణయత్వం - నిజమైన సేవాతత్త్వం :**

వ్యక్తిగతమైన కోర్కెలకు తానెంత ప్రాధాన్యతనిస్తాడో, ఇతరుల శ్రేయస్సు కొరకు, వారి యోగక్షేమముల కొరకు తాను అంతే ప్రాధాన్యతనిచ్చిననాడు మనిషి ఉత్తముడవుతాడు. సంతుల మార్గాన్ని గమనిస్తే 'పరోపకారాయ సతాం విభూతాయః - మహాత్ములకున్న సంపదలన్నీ ఇతరుల సేవకే. పరోపకారార్ధం ఫలంతి వృక్షాః - పరోపకారార్ధం దుహంతి గావః - పరోపకారార్ధం వహంతి నద్యా - పరోపకారార్ధం ఇదం శరీరం అంటూ ప్రమాణాలు చెప్పాయి. పరులకు ఉపకారం చేయడం కోసమే వృక్షాలు ఫలాలిస్తున్నాయి. అవి తినవు కదా? మేఘం కురిపించిన నీటిని స్వీకరించి, భూమి నుంచి ధాతువులు స్వీకరించి, గాలి నుండి కర్బన వాయువును స్వీకరించి, చివరకు ఫలాలను మాత్రం మనకిస్తాయి - ఇది కదా పరోపకారమంటే.

గోవు-బిడ్డ జన్మించిన కొన్ని వసంతాలు మాత్రం తల్లి పాలివ్వగలుగుతుంది. తర్వాత... అందరికీ పాలిచ్చేది... మనలను లాలించేది గోవు... తన బిడ్డలకు ఇచ్చేది కొంత... కానీ మనకు కొండంత. అందుకే అన్నారు గో'మాత' అని.

నది - పుట్టుక ఎక్కడో, పరుగు మాత్రం అన్నిచోట్లా! పరుగెత్తిన ప్రాంతం సస్యశ్యామలం. మనిషి బ్రతుకు పచ్చని పంటలతో పదిలం. అందుకు ప్రతిగా కృష్ణమ్మ తల్లి, తల్లి గోదారి అని పిలిచారు. నేర్చుకొనే దృక్పథం మనలో ఉండాలనే సద్గురు వాక్యం స్మృతిలో ఉంటే నిజానికి మహాత్ముల బిడ్డలుగా మనలో ఇంతటి గొప్ప స్పృహ కలుగకమానదు. నిజానికి సేవంటే ఇది! సేవ కొరకు సేవగా నుండును గాని ఎటువంటి ప్రతిఫలాపేక్ష ఉండదు.

వ్యాధిగ్రస్తుడైన మనిషికి చేసే శారీరక సహాయం, సానుభూతి అవుతుంది కానీ సేవ కాజాలదు. శారీరక రుగ్మత మాత్రమేనా? మరి మానసికమైన అపరిపక్వత కూడా వ్యాధే అయ్యింది కదా! మరి దాని

సంగతేంటి? వ్యాధి ఉంటేనే సహాయం చేసేట్లయితే మరి మనల్ని అనుక్షణం కంటికి రెప్పలా కాచే సద్గురులీల లన్నింటిని ఏమని పిలవాలి. మనిషిని మనిషిగా ఆదరించగలిగే పరిణతి రావాలి. అందుకు సద్గురు పథం మనకు త్రోవకావాలి! అందుకే బాబా అన్నారు "నీ వద్దకు వచ్చే ప్రతిజీవినీ ప్రేమించి, ఆదరించమని".

తేలేదేమంటే సేవంటే – శ్రమ కాదు. ప్రతిఫలాపేక్ష లేని పరోపకారము నిజమైన సేవ. సేవ కలిగించేది మనలో వికాసము – అహముకాదు. సేవ మనిషి లోని అంతరాంతరాళములను శుభ్రపరచి నిర్మలముగానూ, ప్రశాంతముగానూ తీర్చిదిద్దుతుంది. మనిషి తన సహజత్వముతో ఉట్టిపడుతూ, నూతనముగానూ, ఉత్తేజముగానూ, ఎందరికో ఉత్ప్రేరకముగానూ మనగలుగుతాడు. సేవ మనిషిని వినయ సంపన్నుని చేస్తుంది. చేసే ప్రతి పనిలోనూ కలిసే ప్రతిమనిషిలోనూ సద్గురు సందర్శనం చేసుకున్ననాడు పర ఉపకారమే కాని, పరులకు అపకారము జరుగదు కదా! తన చెంతకు చేరిన ప్రతి జీవిని సాయిప్రసాదముగా స్వీకరించిన గురుదేవులు  చేసింది నిజమైన సాయి (మాధవ) సేవే!

***మదిలో మాధవుడు... 'అహ'మెరుగని శ్రామికుడు***

కొలిమిలో బిడ్డ పడిపోబోయింది. తన చేయి అక్కడే ఉన్న అగ్నితో గాయమయ్యింది. తానున్నది 'మనలో'– బిడ్డను కాపాడెను ఇలలో. మనకు ఉపయోగమవుతుందంటే ఎదుటివాడికి ఎంత ఇబ్బందయినా సరే లక్ష్యపెట్టని స్థితిలో ఉంది సమాజం.  మహాత్ముల చర్యలు గమనిస్తే తమకు (శారీరకంగా) విలువివ్వలేదు. తనువుకు (ప్రాణానికి) విలువివ్వలేదు. పరోపకారం కోసం మాధవుడైనవాడు సదా మానవసేవ చేసుకుంటూనే ఉన్నాడు. మానవుడే మాధవుడయ్యే ప్రయత్నం లేకుండా / చేయకుండా 'సేవ'కు కొత్త అర్థానిస్తున్నాడు. ఈ రోజు సేవంటే కొన్ని లక్షల ఖర్చు, కొన్ని ప్రకటనల చిత్తు, మరికొన్ని బిరుదుల మత్తు. కానీ దానిపేరు 'సేవ'. వాటికై సంస్థలు, వ్యవస్థలు, ట్రస్టులు, పర్సనల్ ఇంట్రస్ట్‌లు.

వెనక్కు తిరిగి చూసుకుంటే భారతదేశంలో అనాథ శరణాలయాలు, వృద్ధ ఆశ్రమాలు ఉండేవి కాదు. పశ్చిమదేశాలలో ఉన్న ఈ సంస్కృతి మనకు కనపడేది కాదు. ప్రేమానుబంధాలతో ముడిపడిన కుటుంబ వ్యవస్థ, పరస్పరం సహకరించుకునే గ్రామీణవ్యవస్థ, జ్ఞానమును–కర్మలను బండికి రెండు ఇరుసులుగా (చక్రాలు) సమన్వయంతో సాగే వర్ణ వ్యవస్థతో తులతూగిన ఋషి (సంతు) సంప్రదాయం మనది. 'నేను'కు ఎక్కడా చోటు లేదు. 'మనం' అన్నది ఆనాటి భారతీయుల 'ధనం'. 'అందరం'లోనే 'ఆదరం' ఉంది. 'ప్రేమ'లు తగ్గాయి. వృద్ధ, అనాథ ఆశ్రమాలు పెరిగాయి. ఒకానొక ఆసుపత్రిలో కన్పించింది "మానవసేవే–మాధవసేవ" అని. ఈ రోజున మన భావన ఏమంటే ఆర్తులకు, దుఃఖితులకు, రోగపీడితులకు చేసే సేవ – మానవసేవ అని. మానసికంగానూ, శారీరకంగానూ సరిగా లేనినాడు 'మనిషి' కాడని అర్థం. మనం చేసేది వాడిని 'మానసిక–శారీరకం'గా మనిషిని చేస్తున్నాం. దుక్కలా, బలిష్టంగా ఉన్నవాడు వచ్చి, 'అమ్మా! అంత అన్నంపెట్టు' అంటే – ఏమయ్యా దుక్కలా ఉన్నావు – ఏదో ఒక పని చేసుకోవచ్చుగా అంటాం! ఇదిగో ఇది మన 'సేవ' యొక్క 'అహం' స్వరూపం. 'అహం' స్ఫురణను మరచిననాడు మనిషికి తన జీవిత అంతరార్థం బోధపడుతుంది. శంకరులు తమ ప్రశ్నోత్తర మాలికలో చెప్తారు "కిం మనష్యేష ఇష్టతమం! ఏది ఉన్నతమైన కోరిక?





సమాధానంగా "స్వపరహితాయ ఉద్యతం జన్మ" తన హితం కోసం, పరుల హితం కోసం కోరుకోవాలి అన్నారు. వివేక చూడామణిలో ఇలా చెప్పారు - మనిషికి, మహాత్ముడిలా బ్రతికే దారి చూపుతూ "వసంతవత్ లోకహితం చరంతః" వసంతం మనకు కన్పిస్తుందా? కానీ తను వస్తే దక్షిణ గాలులు వస్తాయి. చెట్లు చిగురిస్తాయి. రాలిపోయిన ఆకులు క్రొంగొత్త రూపు ధరిస్తాయి. మహాత్ములూ అంతే. మాధవుడి ప్రతిరూపాలు- పరిపూర్ణ స్వరూపాలు. వాళ్లే మనకు సేవలో మార్గదర్శకులు. వారి 'హృదయ' వసంతమే మనకు ఆదర్శం.

**సేవ- ఏది త్రోవ**

అప్పర్‌స్వామి అనే మహాత్ముడి మార్గనిర్దేశం ఇలా ఉంది. "నా ధర్మం పనిచేయడమే, చేసి సదలించుకోవడమే" అన్నాడు. అతడేమి చేసేవాడు! భగవత్ కీర్తనలు పాడి, భక్తులను పరవశులను చేసేవాడు. అతని దగ్గర కొందరు పలుగు, పారలతో సిద్ధంగా ఉండేవారు. వాటితో ఆలయాలను, సత్సంగ ప్రాంగణాలను శుభ్రం చేసేవారు. ఆలయ మూర్తులకు దీపావళికి క్రొత్త బట్టలనిస్తూ, బీదసాదలకు వస్త్రాలనిచ్చేవారు. గ్రామగ్రామాల్లో సత్సంగ ప్రాంగణాలు, చెత్త ఏరివేయడం, ఆలయాలకు వెల్లవేయడం ఇలా ఏదైనా సరే భగవత్ స్మరణ - సత్కర్మాచరణ - శుద్ధి చేసుకునే అంతఃకరణ. అంతఃకరణ శుభ్రమయ్యాక మనిషి మనసు ఆలయమే కదా! అందులో కొలువుండేది మాధవుడే (సాయి) కదా! గమనిస్తే సాయిచరిత్ర మొత్తం ఆనాటి సాయిగురుబంధువులు చేసిన, చూసిన సేవలే గుర్తొస్తాయి.

ఒకానొక గురుబంధువు - శిరిడీ వచ్చి మరొక గురుబంధువు ఇంట్లో సాయికి అర్పించడానికి ప్రసాదం చేసుకుంటూ ఆ ఇంట్లో వారికి కూడా వంట చేసివచ్చేది. సాయి ఆదేశానుసారం. మరో గురు బంధువుకు ఆరోగ్యం బాగులేకపోతే అనుక్షణం అతని దగ్గరే ఉండి సపర్యలు చేస్తారు మరొకరు. చెంత చేరిన పులి వంటి జంతువుకు ఆదరణే, జంతువులులాగా బ్రతుకుతున్న మనుషులకు కూడా అదే ఆదరణ.


మనలో సాయి చూసింది 'తననే'. వారి ప్రతిరూపాన్నే. పూజ్య గురుదేవులు చేసిందీ అదే. అపకారపు స్వరాలతో వచ్చిన జీవులకు ఉపకారపు వరాలనిచ్చిన, ప్రతిఫలాపేక్షలేని పరిపూర్ణులు - మాధవ స్వరూపులు- సద్గురువులు. తమ చెంతకు చేరిన ప్రతి జీవిని సాయి ఋణానుబంధంగా స్వీకరించి, ఆదరించి, అవసరాలన్నీ తీర్చిన మహితాత్ములు శ్రీబాబూజీ.

చివరగా - మానవసేవను మాధవసేవగా చేయాలనుకుంటే మన చెంతకు చేరిన ప్రతీ జీవిని సాయి ప్రతిరూపంగా దర్శిద్దాం. ప్రతి మనిషిలోనూ మాధవుడే ఉన్నాడన్న స్ఫురణ మనలో కలిగితే మనం చేసే ఏ సేవ అయినా మాధవుడికే కదా చేరేది. మనం చేసే సేవ మాధవునికే అని తెలిసిననాడు మానవసేవ-మాధవసేవే అయ్యింది కదా!

ఈ జయనామ వత్సరంలో సద్గురు అనుగ్రహ 'వసంతం' మనలోని మనో మాలిన్యాలను శుభ్రం చేసి, ప్రతీ జీవి సద్గురు స్వరూపమేనన్న స్ఫురణ చిగురించి - అందరి జీవితాల్లో ఆనందం అంబరాన్నంటాలని ఆకాంక్షిస్తోంది- అనుగ్రహ రారాజులు శ్రీసాయిమహరాజ్, గురుమహారాజ్‌లను వేడుకొంటోంది 'గురుకృప'.

'గురుకృప'.

## దర్శనం జనవరి 2014



**భక్తుడు** : గురువుగారూ! నేను దర్శనం గురించి కొన్ని ప్రశ్నలు అడగాలనుకొంటున్నాను. నా అవగాహన ప్రకారం, దర్శనం అంటే సద్గురువునుగానీ లేదా భగవంతుని రూపాన్నిగానీ 'చూడటం'. అసలు ఈ 'చూడటం' అంటే ఏమిటి? మనం పొందే ఫలితం ఆ చూసే విధానంలో ఉందా? లేక ఆ సద్గురువు మనల్ని చూడటంలో ఉందా? ఆ సద్గురు రూపాన్ని ఎన్నడూ మరచిపోకుండా మన మనస్సులో పదిలపరుచుకోవడానికి ప్రయత్నించాలా? లేక ఆ సద్గురు సాన్నిధ్యంలో ఉన్నప్పుడు మనం పొందే అంతర్గతమైన అనుభూతి మీద మనస్సు లగ్నం చేయాలా? దర్శనసమయంలో మరింత ఫలితం పొందడానికి మార్గమేమిటి?.... ఇలాంటివి నాకెన్నో ప్రశ్నలున్నాయి.

**గురువుగారు :** ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమివ్వడానికి, మీకు బాగా అర్థమవడానికి నేను ఒక ఉదాహరణ ఇస్తాను. మీరు సినిమా చూస్తున్నారు, మీరు కేవలం తెరమీద కదలాడే బొమ్మలను మాత్రమే చూడటం లేదు, "నేను సినిమా చూస్తున్నాను" అంటారు కానీ నిజంగా అక్కడ జరిగేది ఏంటంటే – నీకు, ఆ సినిమాకు మధ్య ఒక రకమైన ఇంటరాక్షన్ జరుగుతూ ఉంటుంది. నువ్వు తెరమీద పాత్రలలో లీనమై నవ్వుతావు, ఏడుస్తావు, నిరాశపడతావు, కోప్పడతావు లేదా నీకు విసుగు పుట్టవచ్చు కూడా! "నేను సినిమా చూస్తున్నాను" అని మీరు అనవచ్చు, కానీ మీరు నిజానికి కేవలం చూడటమే కాదు, దానిని అనుభూతి చెందుతున్నారు. మీరు సినిమాను చూస్తున్నట్టే బాబాను కూడా చూస్తారు – అదే దర్శనం అంటే, అంతే! మీరు కేవలం చూడటం మాత్రమే కాదు, మరేదో అనుభవాన్ని పొందుతున్నారు.

**భక్తుడు** : మిమ్ములను దర్శించుకునే సమయంలో మేము మరింత అనుగ్రహాన్ని ఎలా పొందాలి?

**గురువుగారు :** మీరు మరింత పొందడమెలాగో నాకు తెలియదు కానీ నేను వచ్చేది మాత్రం మీ దర్శనానికే! నేను సత్సంగహాలుకు దర్శనం ఇవ్వడానికి రావడం లేదు, దర్శనం చేసుకోవడానికి వస్తున్నాను. అవును, నా అనుభవం అది. అది నాకెంతో సంతోషాన్నిస్తుంది.

ఒకరికి దర్శనమిచ్చేందుకు నేనెంతవాణ్ణి? మహిమాన్వితమైన సాయినాథుని సన్నిధే మనల్నందరినీ భక్తి ప్రేమలతో ఆయన దర్శనానికి ఆకర్షిస్తుంది. మనందరికీ సర్వదా బాబానే దర్శనీయుడు. అంతమంది సాయిభక్తుల ముందు కూర్చున్నప్పుడల్లా నాకు "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్" అన్న వేదసూక్తం స్ఫురణకు వస్తుంది. సహస్ర శిరస్సులతో,





సహస్రనేత్రాలతో శ్రీసాయి తమ విరాట్ స్వరూపంతో దర్శనమిచ్చి, ప్రసన్నదృష్టితో చూస్తున్నారనిపిస్తుంది. ఆ విరాట్ స్వరూపాన్ని దర్శనం చేసుకోవటమే నేను చేసేది!

**భక్తుడు** : సద్గురువు యొక్క దృష్టి గురించి – ఆ దృష్టి యొక్క విశిష్టత గురించి ఎందుకంత గొప్పగా చెప్పబడుతుంది?

**గురువుగారు :** ఎందుకంటే అది ప్రేమను తెలియచేస్తుంది కాబట్టి. గురువు ద్వారా వ్యక్తమయ్యేది ప్రేమ, మీకు గురువు పట్ల ఉండేది ప్రేమే. ఆయన చూపు మిమ్మల్ని ప్రేమతో ముంచెత్తుతుంది. ఆ చూపులో ఉండేది ఆ ప్రేమే. ఆ చూపుకు విలువనిచ్చేదీ ఆ ప్రేమే. మన కరెన్సీ నోటు మీద గవర్నర్ సంతకం లాంటిది ఆ ప్రేమ. (గురువుగారు నవ్వుతూ...) నిజానికి అది చూపు మాత్రమే కాదు, మరేదో కూడా జరుగుతూ ఉంటుంది; ఒక రకమైన ఇంటరాక్షన్ (పరస్పర స్పందన) జరుగుతూ ఉంటుంది.

ఆ ఇంటరాక్షన్‌కు మనం 'సినిమా చూడటాన్ని' ఒక మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. నా ఉద్దేశ్యం సినిమాలోని పాత్రలు మీతో వచ్చి మాట్లాడతాయని కాదు, కానీ అక్కడ ఏదో ఇంటరాక్షన్ జరుగుతూ ఉంటుంది. మీరు ఒక పాత్రతో తాదాత్మ్యం చెందుతారు. కేవలం సినిమా చూస్తున్నప్పుడే ఇటువంటి ఇంటరాక్షన్ జరుగుతున్నప్పుడు, వాస్తవంగా మీకు సమాధానమిస్తున్న బాబాతో మాత్రం అది ఎందుకు జరగదు? ఆ నిజాన్ని చూడలేకపోతే, సినిమా చూస్తున్నట్లయినా అనుభూతి చెందండి.

**చూడటం** (Seeing)**, ఉండటం** (being)**, అనుభూతి చెందటం** (experiencing) **ఇవన్నీ కలిస్తేనే దర్శనం. అది కేవలం చూడటం మాత్రమే కాదు, ఎప్పుడైతే ఆ చూడటం జరుగుతుందో అప్పుడు అలా 'కావడం'** (becoming) **జరుగుతుంది.**

**భక్తుడు** : సద్గురువు మనల్ని చూడటం కూడా ఇందులో ఒక భాగమే కదా? కొన్ని గ్రంథాలలో మనం సద్గురువును చూడటం మాత్రమే కాకుండా, సద్గురువూ మనల్ని చూసినప్పుడే దర్శనం సంపూర్ణమవుతుందని చెప్తున్నట్లు ఉంటుంది.

**గురువుగారు :** అవును, ఆయన మనల్ని చూస్తూనే ఉన్నారు. అది సంపూర్ణం కాకుండా ఎలా ఉంటుంది?

**భక్తుడు** : గురువు మాపై దృష్టి సారించకపోతే మేము ఆయనను చూసినా అది నిజమైన దర్శనం కాదు కదా!

**గురువుగారు :** (గురువుగారు కళ్లు పెద్దవి చేసి సూటిగా చూస్తూ...) గురువు ఈ విధంగానే మిమ్మల్ని చూడాలా? (నవ్వులు...) కాదు! ఆయనకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. మనం ఆయనను ఒక విధంగానే చూడగలం. కానీ ఆయన మనల్ని చూడటానికి వెయ్యి విధాలున్నాయి.

**భక్తుడు** : ఎంత గొప్పగా ఉంది, గురువుగారూ!

**గురువుగారు :** మనకు కేవలం రెండు కళ్ళు మాత్రమే ఉన్నాయి. కానీ బాబాకు వేలాది కళ్ళు, లెక్కలేనన్ని కళ్ళు.

**భక్తుడు** : గురువుగారూ, ఇందాక మీరు అలా "కావడం" (becoming) గురించి చెప్పారు. అది హామీనా?

**గురువుగారు :** అవును, అది రాజీ లేని ఖచ్చితమైన హామీ.

**భక్తుడు** : గురువుగారూ, దివ్యదృష్టి అంటే ఏమిటి?

**గురువుగారు : ప్రతిదానిలో దివ్యత్వాన్ని దర్శించగలిగేదే దివ్యదృష్టి.** సద్గురువు అంతటా దివ్యత్వాన్ని దర్శిస్తారు. అందుకనే ఆయన చూపు దివ్యమైనది. మీరు ఆయనను దివ్యస్వరూపంగా చూడగలిగితే, అది కూడా దివ్యదృష్టే.

**భక్తుడు** : సద్గురువు మనల్ని ప్రేమించినట్లుగా మనం వారిని ప్రేమించగలమా?

**గురువుగారు :** అవును, ప్రేమించగలం. ఆయనతో మీరు ఒక్కటయినప్పుడు అది సాధ్యమవుతుంది. అయినా ఆయన మనల్ని ఎందుకు ప్రేమించాలి? ఆయన మనల్ని అంతగా ప్రేమించడానికి మన దగ్గర అంత ప్రత్యేకమైన విషయమేదైనా ఉందా? ఏమీ లేదు. ప్రతి మనిషి అన్నింటికన్నా ఎక్కువగా తనను తానే ప్రేమించుకొంటాడు. మన పరిమితమైన అస్తిత్వం వల్ల మనలో అనేక భావాలు కలుగుతాయి. అది ప్రేమో, ద్వేషమో, మరొకటో, మరొకటో. కానీ సద్గురువు మాత్రం అన్నింటిలోనూ తమను తామే చూసుకుంటారు. మనకు ఆయన మనల్ని ప్రేమిస్తున్నట్లు కనిపిస్తుంది. కానీ ఆయనకు మాత్రం తమను తామే ప్రేమించుకుంటున్నట్లు ఉంటుంది. ఆయన సమస్తాన్ని తమ స్వరూపంగా చూస్తారు. ఆయన చూపే దానికి నిదర్శనం.

ఆ చూపును వర్ణించడానికి సరైన ఉపమానంగానీ, ఉదాహరణగానీ ఖచ్చితంగా ఇవ్వలేము. కానీ కనీసం రవ్వంతైనా అర్థం చేసుకోవడానికి నేను ఒక ఉదాహరణ ఇస్తాను. అప్పుడే పుట్టిన తన బిడ్డను తల్లి చూసే చూపు ఎలా ఉంటుందో ఊహించండి. అప్పటివరకు ఆ బిడ్డ ఆమెలో భాగం, ఆమె శరీరంలో ఒక భాగం, ఆమె నుండి వేరు కాదు. బిడ్డ పుట్టగానే ఆ తల్లి చూసే మొదటి చూపు ఎలా ఉంటుందంటే, తనలోని భాగాన్నే తాను చూసుకుంటున్నట్లుగా ఉంటుంది. బిడ్డ ఏడుస్తుంది, పాలు కోరుతుంది... నెమ్మదిగా వాళ్ళ మధ్య ఇంటరాక్షన్ మొదలవుతుంది. క్రమేణా ఆ చూపులో తొలి అనుభూతి, గాఢత, ఏకత్వానుభవం తగ్గిపోతాయి.



**ఏ చూపు అయితే అన్నింటినీ, అందరినీ తనలోని ఒక భాగంగా చూడగలదో అదే దివ్యదృష్టి.** దేనిని చూసినా "అది కూడా నేనే, నాకంటే వేరు కాదు" అని అనుభూతి చెందుతూ, అలా చూడగలగడాన్ని హంస, సోహం అంటారు, సో-అహం అంటే "అది నేనే". అది



ఏదైనా కానివ్వండి, అదీ నేనే.

**భక్తుడు :** సాధారణమైన లౌకిక ప్రపంచానికి, దివ్యమైన క్షణాలలో (దర్శన సమయంలో) మేము చూసే ప్రపంచానికి గల పరస్పర వైరుధ్యం నాకు ఆసక్తిగా, చిత్రంగా అనిపిస్తుంది. దర్శన సమయంలో మేమంతా ఎంతో భక్తి ప్రపత్తులతో ఉంటాము, దర్శనం అయిపోగానే లౌకిక జీవితం తిరిగి మొదలవుతుంది.

**గురువుగారు :** అది మంచిదే, కనీసం ఆ కొన్ని నిమిషాలైనా మనం ఆ దివ్యత్వాన్ని అనుభూతి చెందగలుగుతున్నాము. మనం ఎంత మేర లౌకికంగా, ప్రాపంచికంగా ఉంటామో అంతగా మనకు ఆ వైరుధ్యము, తేడా తెలుస్తుంది.

**భక్తుడు :** దర్శన సమయాలలో అనుభవమయ్యే ఆ దివ్యత్వాన్ని మా ప్రాపంచిక జీవితంలో ఎలా అనుభవంలోకి తెచ్చుకోవాలి?

**గురువుగారు :** అదంతా మీరు ఇక్కడ ఎందుకున్నారు అనే అంశం మీద ఆధారపడి ఉంటుంది. దర్శన సమయంలో ఆ కొద్దిక్షణాలపాటు మీకు అనుభవమయ్యే దానిని మరింతగా అనుభవంలోకి తెచ్చుకోవడం మీ లక్ష్యమయితే, దానిని సాధ్యమైనదంత  ఎక్కువ సమయం నిలుపుకోవడానికి ప్రయత్నించండి. ఆ అనుభూతిని పెంచుకోవడానికి రకరకాల వ్యక్తులకు రకరకాల మార్గాలు, పద్ధతులు ఉంటాయి. దానిని పెంచుకోవడానికి, "ఇదీ మార్గం, అదీ మార్గం" అని ఒక ప్రత్యేకమైన మార్గమంటూ లేదు. లేదూ, మీకు దాన్ని పెంచుకోవాలని లేకపోయినా, కనీసం ఇతరులను ఇబ్బంది పెట్టకుండా ఉన్నా చాలు.

మీరు ఇక్కడ ఏ లక్ష్యంతో ఉన్నారు అనే దానిమీదనే అంతా ఆధారపడి ఉంటుంది. సాధారణంగా అందరూ ఆ విషయాన్ని మర్చిపోతారు. ఒకవేళ నేను మీకు, "మీరు ఇలానే నడుచుకోవాలి" అని చెప్పాననుకోండి. అది ఒక తంతులాగా మారుతుంది. అప్పుడు దానివల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. మీరన్నట్లు, దివ్యానుభూతికి, ఐహిక జీవితానికి తేడా ఉంది. కానీ, దర్శన సమయంలోని ఆ అనుభూతిని ఎంతగా వీలైతే అంతగా నిలుపుకొని ఆ తేడా లేకుండా చేసుకోవడమే మన లక్ష్యం. మనకు ఇక ప్రాపంచిక జీవితానికి, పారమార్థిక జీవితానికి తేడా అనేది కనిపించకూడదు. అప్పుడు ప్రాపంచికం పారమార్థిక మవుతుంది, పారమార్థికం ప్రాపంచికంగా అనిపిస్తుంది. ఆ అత్యున్నత భావోద్వేగస్థితిలో అంతా ఒకటిగానే ఉంటుంది.

**ఎవరైనా నా దగ్గరకు వస్తే అది బాబా సంకల్పమే, నా సంకల్పం కాదు.** నాకు సాధ్యమైనంత మేరకు వారిని దూరంగా ఉంచడానికే ప్రయత్నిస్తాను. (నవ్వులు....) అయినా కూడా వాళ్ళు వచ్చారంటే, వారిని నా దగ్గరకు తీసుకొని వచ్చేది బాబా మహిమే, నేను దానిని ఆనందంగా తీసుకుంటాను. నేను వారిని

చూసినప్పుడు నాకు బాబా మహిమ కనబడుతుంది, వారిలో నేను బాబాను చూస్తాను.

ఎప్పుడూ నాకది పురుష సూక్తంలో చెప్పిన "సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్" అనే శ్లోకాన్ని గుర్తుకు తెస్తుంది. సహస్ర శిరస్సులు, సహస్ర కరములు, సహస్ర పాదాలు కలిగిన ఆ పురుషుడు, ఆ బాబా నాకు దర్శనం అనుగ్రహించడానికి వచ్చినట్లు అనిపిస్తుంది. నాకు అది ఆనందానుభూతినిస్తుంది. నేను ఒకరికి సాయం చేస్తున్నాను అనే భ్రమ నాకు లేదు. బాబా లీలలను నేను ఆస్వాదిస్తున్నాను. అంతే! నేను నిజం చెబుతున్నాను, మీకు సాయం చేసేది బాబానే, నేను కాదు.

**భక్తుడు** : గురువుగారూ, అన్నింటిలోనూ బాబాను చూడటం ఎలా?

**గురువుగారు :** నేను మిమ్మల్ని అన్నింటిలోనూ బాబాను చూడమని చెప్పడం లేదు. "అన్ని జీవులలోను నేనున్నాను" అని బాబా అన్నారు. అది గుర్తుపెట్టుకుంటే చాలు. మన మనసులో బాబా పట్ల ఉండే భావనను ఇతరులమీద ఆపాదించడానికి ప్రయత్నం చేస్తూ బాబా, బాబా, బాబా అనడం కాదు. అది కాదు. (నవ్వులు...) మనం ఇతరులతో వ్యవహరిస్తున్నప్పుడు ప్రతి ప్రాణిలోనూ బాబా ఉన్నారు అన్న ఎరుక ఉంటే చాలు. ఆ ఎరుక లేకపోయినా పర్వాలేదు, ఇబ్బందేం లేదు. ముందు మీలో బాబాను చూడటానికి ప్రయత్నించండి, తరువాత అందరిలో ఉన్న బాబాను చూడటానికి ప్రయత్నిద్దాం. మనలో ఉన్న బాబానే చూడలేనప్పుడు, ఇతరులలో ఉన్న బాబాను ఏం చూడగలం? ప్రతి జీవిలోనూ బాబా ఉన్నప్పుడు, ఆయన మనలో మాత్రం ఉండరా? ఆయన మనలోనే ఉంటే, ఆయన మనలో ఎలా ఉన్నారు? ఎక్కడ ఉన్నారు? ఎక్కడ దాగి ఉన్నారు? దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ఆ తర్వాత అందరి హృదయాలలో ఉన్న బాబాను తెలుసుకోవడానికి ప్రయత్నించవచ్చు.

"అన్ని జీవులలోనూ నేను ఉన్నాను" అని బాబా చెప్పింది నిజమే అయితే, అసలు మన హృదయం ఆయన ఉండటానికి అనువుగా ఉందా? కాబట్టి ముందు హృదయాన్ని శుభ్రం చేసుకోండి. ఎలాగైతే నేను వచ్చినప్పుడు, ఫ్లాట్ అంతా శుభ్రం చేసి, పూలు పెట్టి సిద్ధం చేస్తారో అలాగే మీ హృదయాన్ని కూడా సిద్ధం చేసుకోవడానికి ప్రయత్నించండి.

**భక్తుడు** : మరి హృదయాలను ఎలా శుభ్రపరచుకోవాలి?

**గురువుగారు :** నేను వచ్చినప్పుడు మీరు ఈ ఫ్లాట్‌ని (ఇంటిని) ఎలా శుభ్రం చేస్తారు? ఎలా ఉంటే నాకు ఇష్టమో మీకు తెలుసు. ఉదాహరణకు మస్కిటో రిపెల్లెంట్ (దోమల నివారణ మందు) నాకు పడదని మీకు తెలుసు కాబట్టి మీరు ఆ చుట్టుప్రక్కల అటువంటివేమీ లేకుండా చూస్తారు. ఇలాంటివి చాలా విషయాలు ఉన్నాయి. బాబాకు ఇష్టమైనవి ఏమిటో మీకు తెలుసు. ఆయనకు ఇష్టంలేనివాటిని తొలగించుకోవడానికి ప్రయత్నించండి. మీరు వాటిని తొలగించుకుంటే,





అప్పుడు బాబా వచ్చి ఆనందంగా మీ హృదయాలలో ఉంటారు. అప్పుడు మీరు ఆయనను ప్రతిరోజూ చూడవచ్చు, నచ్చినప్పుడు మాట్లాడవచ్చు, దర్శించవచ్చు. బాబా వచ్చి (గురువుగారు తమ హృదయంకేసి చూపుతూ..) ఇక్కడ, మీ స్వంత ఫ్లాట్‌లో ఉంటారు.

**భక్తుడు** : గురువుగారూ, మిమ్మల్ని వీలైనన్నిసార్లు దర్శించుకోవాలని ఉంటుంది. మీరు అలా నడిచి వెళుతున్నప్పుడు (దర్శన సమయంలో) మీరు ఆగి నా వైపు చూడాలంటే నేనేం చేయాలి?

**గురువుగారు :** మనం ఒక పూతోటలో నడుస్తున్నపుడు పువ్వులు తాజాగా ఉంటే కాసేపు నిలబడి చూడాలనుకోవటం సహజం. ఆ పూలలోని తాజాదనం పోతే, ఇక అక్కడ చూడటానికి ఏముంటుంది? అందుకని మీరు ఆ వాడిపోయిన పువ్వుల్లా ఉండవద్దు. ఎప్పుడూ ఆ తాజాదనాన్ని నిలుపుకోండి. అప్పుడు నేను ఆగి మిమ్మల్ని చూసేలా బాబా చేస్తారు. ఎందుకంటే, నేను మీలో చూసేది ఆ తాజాదనాన్ని, అలా వికసించడాన్ని, ఆ సారాన్నే, ఆ పరిమళాన్నే. మీరు సీనియర్ అయినప్పటికీ మీలో ఆ తాజాదనం పోకూడదు. మీరు వాడిపోయిన పువ్వులా ఉండాలనుకుంటున్నారా? లేక వికసిస్తూ, పరిమళాలు వెదజల్లే పువ్వులా ఉండాలనుకొంటున్నారా?

మన మనస్సులు బాబా పాదాల వద్ద సమర్పించే వికసించిన పువ్వుల్లా ఉండాలి. అవి ఎండిపోయి, వాడిపోయి ఉండకూడదు. దర్శనానికి వచ్చిన ప్రతిసారీ అదే మొదటి దర్శనంగా అనిపించాలి. అప్పుడు మీరు , “మేము సీనియర్స్, వాళ్ళు క్రొత్తవాళ్ళు, మేము ఇలాగ, వాళ్ళు అలాగ...” అనే వాటి నుంచి బయటపడతారు. ఇలాంటివన్నీ తీక్షణమైన సూర్యకిరణాల వంటివి. అవి పువ్వులను త్వరగా వాడిపోయి, ఎండిపోయేలా చేస్తాయి. ఎవ్వరికీ కూడా వారు సీనియర్స్ అనే భావం ఉండకూడదు. ఒక్కసారి సీనియర్ అని అనుకున్నామా, మనం రిటైర్మెంట్‌కి సిద్ధంగా ఉన్నామని అర్థం! (గురువుగారు నవ్వుతూ...) ఆ తాజాదనాన్ని కాపాడుకోండి, ప్రతిసారీ అదే మొదటిసారవ్వాలి.

రాముని రూపాన్ని వర్ణిస్తూ, “క్షణక్షణే యన్నవతా రమణీయ రూపం” అంటారు వాల్మీకి. అంటే క్షణక్షణే – ప్రతిక్షణమూ, అనుక్షణమూ; యన్నవతా – అది నవ్యమైనది, నిత్యనూతనమైనది; రమణీయ రూపం – రాముని మనోహర రూపం. అంటే మనం రాముని రూపాన్ని ఎప్పుడు చూసినా క్రొత్తగానే ఉంటుంది, మనకు విసుగు అనిపించదు. అలానే బాబా రూపం ప్రతిక్షణం ఎంతో అందంగా, నిత్యనూతనంగా, నిరంతరం మారుతూ ఉండి ప్రతిసారీ మొదటిసారి చూస్తున్నట్లుగానే ఉంటుంది. ఈ క్షణక్షణే యన్నవతా – ఈ నిత్యనూతనత్వం మీ జీవితం మొత్తానికి, మీ ఆధ్యాత్మిక అనుభవానికి విస్తరించాలి. ప్రతిక్షణం నూతనమై, సచేతనమై, తాజాదనంతో నిండిపోవాలి. అప్పుడు మీరు నిజంగా నాతో, బాబాతో లేదా ఆ సత్ పదార్థంతో – మీరు దానిని ఎలా పిలిచినా సరే – దానితో సాంగత్యంలో ఉన్నట్లే లెక్క. **ఆ నవ్యత్వాన్ని, ఆ తాజాదనాన్ని అనుభూతి చెందగలగడమే నిజమైన దర్శనం.**

**భక్తుడు** : మామూలుగా ప్రాపంచికంగా ఉండే ప్రేమలకంటే మనకు సద్గురువు పట్ల ఉన్న ప్రేమ చాలా భిన్నంగా అనిపిస్తుంది. ఆ ప్రేమను వర్ణించడంగాని, దానిని నిర్ధిష్టంగా పట్టుకోగలగడంగానీ సాధ్యపడుతుందా? అది చాలా మిస్టీరియస్‌గా (మార్మికంగా) అనిపిస్తుంది.



**గురువుగారు :** ఈ ప్రశ్నకు అంత సులువుగా సమాధానం చెప్పలేము, ఎందుకంటే ఇందులో చాలా ప్రశ్నలు ఇమిడి ఉన్నాయి. సద్గురువు అంటే ఏమిటి? మనకు సద్గురువు అవసరం ఏమిటి? మీరంటున్న ఆ లౌకికమైన ప్రేమంటే అసలేమిటి? ఈ మార్మికమైన ప్రేమ (సద్గురువు పట్ల ఉండే ప్రేమ) ఏమిటి? అది నిజంగా మార్మికమైన ప్రేమా లేక మనకు మార్మికత (మిస్టరీ) పట్ల ఉండే ప్రేమా? సద్గురువు పట్ల ఉండేటటువంటి ప్రేమను అర్థం చేసుకోవాలంటే ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెలియాలి.

**భక్తుడు** : గురువుగారూ! సద్గురువుకు, భక్తునికి మధ్య ఉండే సంబంధాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాను, కాస్త వివరిస్తారా?

**గురువుగారు :** ముందు, మీ అనుభవంతో మొదలుపెట్టండి, మీకు దుఃఖం ఉంది, మీలో నిస్పృహ ఉంది. మీకు అన్నీ ఉన్నా, 'ఇంకా ఏదో లేదు' అనిపిస్తూ ఉంటుంది. అదేమిటో మీకు తెలియదు. కొన్నిసార్లు మీరు, "నాకున్న కొరత ఇది కావచ్చు, లేకపోతే అది కావచ్చు, దానివల్లనే నాకీ అసంతృప్తి ఉందేమో, నేను దానిని పొందితే నాకు ఆనందం వస్తుందేమో" అని అనుకొంటారు. అప్పుడు దాని కోసం ప్రయత్నం చేస్తారు. దాన్ని పొందిన తర్వాత కూడా ఇంకా ఏదో కొరత ఉన్నట్లనిపిస్తుంది. మీ దగ్గర డబ్బులున్నాయి, అన్ని సౌకర్యాలున్నాయి, బాగా చూసుకునే తల్లిదండ్రులున్నారు, అందరితో సంబంధబాంధవ్యాలు బాగున్నాయి, మీకు అన్నీ ఉన్నాయి, అయినప్పటికీ మీరు సంతోషంగా లేరు. ఆ కొరత ఏమిటయ్యా అంటే, "ప్రేమ!" అని మీరు అంటారు. "పిల్లలు నన్ను ప్రేమిస్తున్నారు, నా భార్య నన్ను ప్రేమిస్తోంది, నా భర్త నన్ను ప్రేమిస్తున్నాడు, నాకు మంచి కుటుంబం ఉంది, నన్ను అందరూ ప్రేమిస్తున్నప్పటికీ ఇంకా నేను ప్రేమ కోసం వెతుకుతున్నాను - ఆ ప్రేమ ఏమిటి?" అని ఆలోచించి, "లేదు, లేదు. బహుశా ప్రేమ కాదేమో! అది జ్ఞానం కావచ్చు" అనుకొని వేదాంత గ్రంథాలు చదివి మరింత అయోమయంలో పడతారు. ఇంకా ఆ లోటేదో మనల్ని తొలుస్తూనే ఉంటుంది. ఆ తెలియని కొరత "ఎక్స్" (X) ఏమిటి? ఆ ఎక్స్ (X) యొక్క విలువ ఏమిటి? ఆ లెక్కను (సమీకరణాన్ని) మీరు ఏ రకంగా పరిష్కరించాలని చూసినా మీరు ఎక్స్ (X) విలువను కనుక్కోలేరు, మీకు సరైన సమాధానం దొరకదు. అలా మీ జీవితమంతా ఓ లోపంతో కూడిన సూత్రం మీద ఆధారపడి ఉంటుంది.





ఎప్పుడైతే మీరు సద్గురువును కలుసుకుంటారో అప్పుడు, "బహుశా ఆ ఎక్స్ (X) ఆయనేనేమో" అనిపిస్తుంది, ఎందుకంటే మనలో ఉండే ఆ తెలియనటువంటి కొరతను ఆయన మనకు తెలియజేస్తారు, ఆ కొరతను తీరుస్తారు.

సద్గురువును చూస్తే "బాగా పరిచయం ఉన్న వ్యక్తిలానూ, అదే సమయంలో చాలా క్రొత్తగానూ" ఉంటారు. అందుకనే సద్గురువును నేను "బాగా తెలిసినట్లు ఉండే క్రొత్త వ్యక్తి" అంటాను. ఆయన ఎందుకలా అనిపిస్తున్నారో మనకు తెలియదు. మన అంతరంగంలోని ప్రతి అణువూ ఆయనకు తెలుసనిపిస్తుంది. కానీ ఆయనెవరో మనకు తెలియదు, ఏం చేస్తున్నారో మనకు తెలియదు. ఆయన నన్ను ప్రేమిస్తున్నారా లేదా? ఆయన ఏమైనా చేస్తున్నారా లేదా? ఆయన నిశ్చలంగా ఉన్నారా లేక క్రియాత్మకంగా ఉన్నారా? ఒక్క క్షణం ఆయన చాలా ఆప్తునిలా కనిపిస్తారు, మరు నిమిషం పూర్తి అపరిచితునిలా అనిపిస్తారు. ఆ రెండు అంశాల కలయిక, ఆ తెలిసీ తెలియనట్లుండే పరస్పర వైరుధ్యం (సన్నిహిత భావన, క్రొత్తదనం), మనల్ని ఆయనతోను, మనలోని నిజమైన కొరతతోనూ కలుపుతుంది. తెలిసీ తెలియనట్లుండే అనుభవమే ఆ అయస్కాంతం (సద్గురువు) యొక్క మొదటి ఆకర్షణ. అది మనల్ని సద్గురువు యొక్క పరిధిలోనికి తీసుకొస్తుంది. మనకు అనుభవమయ్యే ఆ క్రొత్తదనాన్ని తొలగించుకొని మరింతగా మరింతగా ఆయనను తెలుసుకునే విధానమే మనలోని అస్పష్టమైన సంపూర్ణత్వ భావనను అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవడం. కాబట్టి అక్కడ క్రొత్తదనం ఏమిటి? ఆ మిస్టరీ (మర్మం) ఏమిటి? దానిని తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. చివరికి మనం ఆ మిస్టరీని ఛేదించినా, ఛేదించక పోయినా, మన ఆనందాన్వేషణ మొత్తం ఆ మిస్టరీని ఛేదించడానికి చేసే ప్రయత్నమే. అదే మార్గం, సాధన, ఆధ్యాత్మిక అన్వేషణ.

**భక్తుడు** : నన్ను ఇక్కడకు తీసుకువచ్చింది ప్రేమేనని నేను చెప్తున్నప్పటికీ, నాకింకా ప్రేమంటే ఏమిటో తెలియదు అనిపిస్తుంది.

**గురువుగారు :** మీకొక్కరికే కాదు. నా దృష్టిలో చాలా మందికి ప్రేమంటే ఏమిటో తెలియదు. ప్రేమంటే ఇది, ప్రేమంటే అది అని అనుకొంటూవుంటారు. ఒక అమ్మాయి, అబ్బాయి ఒకరినొకరు చూసుకున్నారు, ఆ తొలిచూపులోనే వారికి ప్రేమ కలిగిందనుకుందాం. "నేను నిన్ను ప్రేమిస్తున్నాను, గాఢంగా ప్రేమిస్తున్నాను!" అని ఒకరితో ఒకరు చెప్పుకుంటారు. కొంతకాలం తర్వాత ఆ ప్రేమ యాంత్రికంగా, ఒక అలవాటుగా మారి క్రమంగా ఆవిరైపోతుంది. అప్పుడు తిరిగి ఎవరి ఆనందాన్ని వారు అన్వేషిస్తూ ముందుకు సాగిపోతారు. కొంతమంది అధికారం కావాలనుకుంటారు, ఇంకొంతమంది డబ్బు కావాలనుకొంటారు. మరికొంతమంది కీర్తి కావాలనుకొంటారు. ఇవన్నీ వారి అన్వేషణలో ఒక భాగం మాత్రమే. అప్పుడు ఒకానొక క్షణంలో (సద్గురువుకు సంబంధించిన) ఒక అనుభూతి కలిగి, "అవును, ఇదే నాకు కావలసింది, ఇదే నా పరిపూర్ణత్వం"

అంటారు. కానీ అప్పుడు కూడా పూర్తి స్పష్టత రాదు. ఉదాహరణకు భగవాన్ రమణులను తీసుకోండి. "అరుణాచలం" గురించి ఆయన మాట్లాడేటప్పుడు, "ఏమీ తెలియని చిన్నవయస్సు నుండి కూడా తమకు అరుణాచలం పట్ల ఏదో తెలియని ఆకర్షణ ఉండేద"ని చెప్పేవారు. వాస్తవంగా అప్పుడు ఆయనకు "అరుణాచలం" అంటే ఏమిటో తెలియదు. అది ఒక కొండా? ఒక దేవుని పేరా? ఎవరైనా వ్యక్తి పేరా? లేక ఒక స్థితా? ఏమీ తెలియదు. కానీ "అరుణాచలం" అనే పేరు వినిపించినప్పుడల్లా ఎందుకనో అది బాగా తెలిసినట్లు అనిపించేది. అదే సమయంలో దాని గురించి ఏమీ తెలియదు. అలా ఆయన తమ అన్వేషణ మొదలుపెట్టారు, అరుణాచలానికి వెళ్లారు. ఆయన అక్కడ ఉన్నప్పుడు ఆయనకు అరుణగిరి మరింత సన్నిహితంగా అనిపించేది. కానీ అదే సమయంలో అది చాలా క్రొత్తగానూ ఉండేది. బాబా విషయంలోనూ అదే జరిగింది. ఆయన గురువు కోసం అన్వేషిస్తూ వెళ్లారు. తమ గురువును చూసిన క్షణం "అవును, ఈయనే నా గురువు" అని బాబాకు తెలిసింది. బాబాకు అప్పుడు వారి గురువు గురించిగానీ, వారి పుట్టుపూర్వోత్తరాల గురించిగానీ ఏం తెలుసు? ఏమీ తెలియదు. కానీ ఏదో చెబుతుంది, "ఆయనే తమ గురువు" అని. అక్కడితో కథ ముగిసిపోదు, అది ఆరంభం మాత్రమే. అక్కడ బాబాకు క్షణమాత్రం ఒక అంతుబట్టని, మార్మికమైన, అనిర్వచనీయమైన అనుభూతి ఏదో కలిగింది, కానీ అదే సమయంలో బాగా తెలిసిన విషయంలాగానూ ఉంది. అప్పుడు ఆయన దాని గురించి ఇంకా ఇంకా మరింతగా తెలుసుకోవాలని ప్రయత్నించారు.

ఆ తెలిసీ తెలియని అనుభూతి ఏమిటో తెలిసేకొద్దీ దాని గురించి ఇంకా ఇంకా తెలుసుకోవాలనిపిస్తుంది. ఆ మర్మాన్ని మీరు తెలుసుకునేకొద్దీ, ఆ అనుభవాన్ని పొందే కొద్దీ అది మీకు నిజంగా కావలసిందేమిటో దానిని వ్యక్తం చెయ్యడానికి, అనుభవరూపంలో పొందడానికి మీకు అవకాశాన్నిస్తుంది. మీకు నిజంగా పరిపూర్ణత్వాన్ని ఇచ్చేది ఇదే. ఆ పరిపూర్ణత్వానుభవం నుండి ప్రేమ జనిస్తుంది. ఆ పరిపూర్ణానందానికి వ్యక్తీకరణే ప్రేమ.

కాబట్టి ఆ తెలిసీ తెలియని అనుభూతే నిన్ను పరిపూర్ణానందం వైపు లాగి, నీవు దానిని అన్వేషించి, ఇంకా ఇంకా వ్యక్తపరిచేలా చేస్తుంది. అదే మీకు ఆ థ్రిల్‌ను, ఉత్కంఠను కలిగిస్తుంది. ఆ తెలిసీ తెలియని అనుభూతే లేకపోతే నీకు అన్వేషించాలన్న తపనే ఉండదు. అదే తెలిసీతెలియనట్లుండటంలోని పరస్పర వైరుధ్యం. మీ జీవితాలను అర్థవంతం చేసేదీ అదే. మనకు తెలిసినట్లే ఉంటుంది కానీ తెలియదు. మనం పొందినట్లే ఉంటుంది కానీ ఇంకా మన వద్ద లేదు.



**భక్తుడు** : గురువుగారూ, ఆ మిస్టరీ అలాగే ఉంటుందా? అది ఎప్పటికీ పోదా?

**గురువుగారు :** చూద్దాం. ముందు దానిని పరిష్కరించడానికి ప్రయత్నిద్దాం. పోవచ్చునేమో,



పోకపోవచ్చునేమో, కానీ ఆ ప్రయత్నమే మీకు ఆ థ్రిల్‌ను ఇస్తుంది. అంతేగానీ, ఆ మిస్టరీ బాధ కలిగించేదిలా ఉండదు. అది చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అందుకనే చూడండి, అందరూ మిస్టరీ నవలలను, ఉత్కంఠ భరితంగా సాగే నవలలను ఇష్టపడతారు.

**గురువుగారు :** అవును, ఆయన నిన్ను ప్రేమిస్తున్నారనే విషయం నీకు స్ఫురిస్తూ ఉంటుంది. అది నీకు తెలుస్తూనే ఉంటుంది. ఆధ్యాత్మిక పయనమంతా ఆ అనుభవం మీదే ఆధారపడి ఉంటుంది.

మీకేదైనా అనుభవం వచ్చినపుడు దానిని ఎలాగైనా వ్యక్తం చేయవచ్చు. కొందరు దానిని మాటలలో వ్యక్తం చేస్తారు, ఇంకొందరు దానిని చేతలతో వ్యక్తం చేస్తారు. అది ఎలా చేస్తున్నారన్నది ముఖ్యం కాదు. మీరు దానిని ఎలా అనుభూతి చెందుతున్నారు అనేదే ప్రధానం. మనకు ఏదో చెప్తుంది, మన అంతరంగంలో ఏదో జరుగుతుంది, మన మనస్సులో అస్పష్టంగా ఉన్నదేదో స్పష్టమవుతుంది. ఇంతకుముందు, నేను మీకు "బాగా తెలిసినట్లుండే క్రొత్త వ్యక్తి" గురించి చెప్పాను. మనం సద్గురువుని కలసినపుడు , "మనకు ఆయన తెలుసు, ఆయనకు మనం తెలుసు" అనే అవ్యక్తమైన అస్పష్టభావన ఏదో మనలో కలుగుతుంది. అది ఏ విధంగా అనేది మనకు తెలియదు. కానీ ఆయనేమో మనకు పూర్తి అపరిచితవ్యక్తి. ఆయన చాలా క్రొత్తగా ఉంటారు, అదే సమయంలో బాగా పరిచయం ఉన్నట్లు అనిపిస్తారు. అది చాలా ఆసక్తికరమైన వైరుధ్యం. మామూలుగా ఎవరి గురించైనా తెలిసేకొద్దీ పరిచయం పెరుగుతుంది, క్రొత్తదనం పోతుంది. కానీ సద్గురువు విషయంలో మాత్రం ఆయన గురించి తెలుసుకొనేకొద్దీ వారు ఇంకా ఇంకా క్రొత్తగా కనిపిస్తారు. మనలో ఆయనపట్ల సహజసిద్ధమైన ఆకర్షణ ఉంటుంది, మనలో ప్రేమ జనిస్తుంది. ఆయనతో మనకు గల సన్నిహితానుభూతి మన హృదయంలోని ప్రేమకు సంబంధించినది, ఆయన వద్ద మనకు అనుభవమయ్యే క్రొత్తదనం మన బుద్ధికి సంబంధించినది. ఆయన మనల్ని ప్రేమించినట్లుగా మన మనస్సు ఆయనను ప్రేమించాలని కోరుకుని ఆయనలో లీనమవ్వాలనుకొంటుంది. ఎవరికైనా సరే మొదట సద్గురువు వద్ద అనుభవమయ్యేది ప్రేమ. అందులో భద్రతాభావమేదో కలుగుతుంది. "సద్గురువుకు నేను తెలుసు, నాకేది మంచిదో ఆయనకు తెలుసు" అని మనకు ఏదో చెబుతుంది. అది మనకెలా తెలుస్తుంది? అది ఒక స్ఫురణ, ఒక అంతర్గత అనుభూతి. దానికి రుజువేమీ లేదు. దానికి ఆధారాలు చూపించడానికి ప్రయత్నం చేయడం వ్యర్థం.

**గురువుగారు :** సద్గురువు విషయానికి వస్తే నీ జీవిత పర్యంతమూ ఆయన నీకు తెలిసినట్లుగా ఉంటారు. కానీ నువ్వు ముప్పై, నలభై, యాభై సంవత్సరాలు ఆయన సాంగత్యంలో ఉన్నప్పటికీ నిజానికి ఆయనేంటో నీకు తెలియదు. మనకు సద్గురువు ఎప్పుడూ క్రొత్తగానే ఉంటారు, కానీ అదే సమయంలో జీవితంలో అందరికన్నా ఆయనే ఎక్కువ సన్నిహితంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఎందుకని ఆలోచిస్తే దానికి మళ్ళీ

కారణమంటూ ఏమీ ఉండదు. మనం కారణాల కోసం చేసే తర్కవితర్కాలన్నీ చివరకు తర్కరహితంగా ముగుస్తాయి. (నవ్వులు...)

**భక్తుడు :** నాకది అవగతం కావడం లేదు. కానీ అదేమి విచిత్రమో అది నాకు అసంతృప్తిని కలిగిస్తోంది, అదే సమయంలో అద్భుతంగానూ ఉంది.

**గురువుగారు :** కానీ ఆ అసంతృప్తి మనకు సాధారణంగా అనుభవమయ్యే అసంతృప్తి వంటిది కాదు. అది అసంతృప్తిని కలిగిస్తున్నప్పటికీ, మనకు అది ఆనందాన్ని కూడా ఇస్తుంది. ఆ మిస్టరీ ఛేదిస్తున్నాం అని మనం అనుకొంటాం. కానీ వాస్తవానికి ఆ మిస్టరీ మరింతగా ఎక్కువై, మనల్ని ఇంకా ఇంకా తనలో (ఆ మిస్టరీలో) లీనం చేస్తుంది. పురాణాలలో రావణాసురుడి కథ ఒకటి ఉంది. రావణాసురుడు శివుని ఆత్మలింగాన్ని సాధించి అమరత్వాన్ని పొందాలని అనుకొంటాడు. ఆ వరాన్ని కోరి శివుని కోసం తపస్సు చేస్తాడు. అతని తపస్సుకు మెచ్చిన శివుడు, రావణునికి ఆ వరాన్ని ప్రసాదిస్తాడు. అయితే ఆ ఆత్మలింగం ఒక్కసారి నేలపై పెడితే దాని శక్తులన్నీ తిరిగి తమను చేరుకుంటాయని షరతు విధిస్తాడు శివుడు. రావణుడు ఆత్మలింగాన్ని తీసుకొని లంకానగరానికి బయలుదేరుతాడు. ఆత్మలింగం యొక్క శక్తులతో రావణుడు భూమిమీద అల్లకల్లోలం సృష్టిస్తాడని భయపడిన నారద మహర్షి గణేశుని సహాయం కోరుతాడు. విఘ్నేశ్వరుడు రావణుణ్ణి ఏమార్చి ఆత్మలింగాన్ని నేలపై పెట్టేలా చేస్తాడు. ఒక్కసారి అది నేలను తాకితే దానిని ఎవ్వరూ, చివరకు పరమశివుడైనా సరే, మళ్ళీ కదల్చలేరు. రావణుడు దానిని లేపడానికి ప్రయత్నం చేసేకొద్దీ అది పెద్దదవుతూ వచ్చింది. రావణుడు భౌతికమైన అనుభవం నుండి ఆత్మను (ఆత్మలింగాన్ని) వేరు చేసి అమరత్వాన్ని పొందాలనుకొన్నాడు కానీ అతనెంత ప్రయత్నం చేసినా, ఆ మిస్టరీ ఇంకా ఇంకా పెద్దది అయింది. ఈ మిస్టరీ కూడా అంతే. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** ఆ మిస్టరీ ఎప్పటికైనా పరిష్కారమవుతుందా? లేక ఇంకా ఇంకా పెరుగుతూ ఉంటుందా?

**గురువుగారు :** ఏమో! అది కూడా మీరే తెలుసుకోవాలి. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** గురువుగారూ, సద్గురువు ఏ స్థితిలో ఉంటారో ఆ స్థితి మాకు ఒక్క క్షణమైనా అనుభవమయితే చాలా బాగుంటుంది కదా? ఆ అనుభవం ఒక్క క్షణమైనా కలిగితే, అది మేము దేనికోసం అన్వేషిస్తున్నామో దాని పట్ల మాకు స్పష్టతనిస్తుంది కదా?

**గురువుగారు :** అది ఒక్క క్షణమైనా మీకు అనుభవమైతే భయం పోతుంది. అప్పుడు మీరు ఆ అపరిచిత వ్యక్తిని (సద్గురువును) ప్రేమించడం మొదలుపెడతారు. అది మీలో ఆసక్తిని, కుతూహలాన్ని, అన్వేషణను, విచారణను రేకెత్తిస్తుంది. అప్పుడు నీ గమ్యంవైపు నీ సాహసయాత్ర మొదలవుతుంది. మరింత ప్రేరణతో నీ గమ్యంకేసి పయనిస్తావు. ఆ కాస్త





అనుభవం మీకు ఎంతో స్పష్టతను ఇస్తుంది. మీకు ఏం కావాలో, ఏం వద్దో, ఏది మరింత కావాలో అన్నీ తెలిసి – మీ లక్ష్యం మీకు స్పష్టమవుతుంది.

**భక్తుడు :** సద్గురువుతో మా అనుబంధం ఎంతో మిస్టీరియస్‌గా ఉన్నట్లనిపిస్తుంది. ఎందుకో మీతో ఉన్నప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంటుంది, కానీ అదే సమయంలో కొంత భయం కూడా ఉంటుంది.

**గురువుగారు :** అవును. ఆ అనుబంధంలో భయం కూడా ఒక భాగమే. నీవు ఒక్కడివే నిజాయితీగా భయం ఉందని బయటపడ్డావు. కానీ ఇక్కడ ఉన్నవారందరికీ కూడా ఆ భయం ఉంది. (నవ్వులు...)

**భక్తుడు :** ఆ భయం ఏమిటి?

**గురువుగారు :** దానిని ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా చెప్తారు. కొందరికి ఇక్కడ (సద్గురువు దగ్గర) చిక్కుకుపోతామోమోనని భయం, కొందరికి స్వాతంత్ర్యం కోల్పోతామనే భయం, మరికొందరికి ఏమవుతుందోనని భయం – అలా మనకు ఏదో తెలియని దానిపట్ల భయం ఉంటుంది. మనకు 'ముక్తి', 'నిర్వాణం', 'ఆత్మ విచారం' మొదలైన సిద్ధాంతాల పట్ల భయముండదు. ఎందుకనంటే వాటితో మనకు వచ్చే నష్టమేమీ లేదు. (గురువుగారు నవ్వుతూ) అందుకే ఈ సిద్ధాంతాలను పట్టుకొని ఆనందంగా ఉంటాం. కానీ సద్గురు సన్నిధి చాలా ప్రమాదకరం. "జాగ్రత్తగా ఉండాలి, ఆయనకు మరీ దగ్గర కావద్దు.కొంచెం దూరంగా అందరి మధ్యలో నిలబడి ఆయనను చూస్తే చాలు" అని అనుకొంటాం. (నవ్వులు...) అవును, నిజంగా అలానే అనుకొంటారు!

నిజంగా చెప్పాలంటే ఆ భయం గురించి ఎవరైనా చెయ్యగలిగిందంటూ ఏమీ లేదు. మీరు చెయ్యగలిగింది ఏదైనా ఉందంటే ఆ తెలిసీ తెలియకుండా ఉన్నదానిని తెలుసుకోవడమే. ఇక్కడ చాలామందికి నన్ను చూసినపుడు నేను వాళ్ళకు "బాగా తెలిసినట్లుండే క్రొత్తవ్యక్తి"లా అనిపిస్తాను. దానిని నేను ఇంతకన్నా వేరే విధంగా చెప్పలేను. మీ అంతరంగంలో నేను మీకు చాలా సన్నిహితంగా తెలుసు అన్న భావన ఉంటుంది, కానీ అదే సమయంలో నేను మీకు క్రొత్తగానూ ఉంటాను. ఆ తెలియని క్రొత్తదనం వలన మీకు భయం కలుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ రకరకాల స్థాయిలలో ఈ "బాగా తెలిసినట్లుండే క్రొత్త వ్యక్తి", అప్పుడే కలుస్తున్నప్పటికీ "బాగా పరిచయం ఉన్నట్లు అనిపించడం" అనే ఈ పరస్పర వైరుధ్యంతో కుస్తీపడుతుంటారు, ఇదే మొత్తం లీల, మొత్తం క్రీడ. ఇదే ఇందులోని రసాత్మకత, ఇందులోని ఆనందం. ఈ మిస్టరీని ఛేదించడంలో సంతోషం ఉంది, ఛేదించలేకపోవడంలోనూ ఆనందం ఉంది. "అబ్బా! నాకిప్పుడు పూర్తిగా అర్థమయింది, ఊహూఁ! నాకసలేమీ అర్థంకాలేదని నాకర్థమైంది"... (నవ్వులు...) ఈ విషయాలన్నీ ఆ భయంతోనే వస్తాయి, ఆ భయంతోనే పోతాయి. నేను మీకు చెప్పినట్లు అందరికీ ఆ భయం ఉంటుంది,

కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువ. ఆ తెలిసీ తెలియనిదాన్ని మీరు తెలుసుకునేకొద్దీ భయం తగ్గిపోతూ ఉంటుంది. అప్పుడు ఆ తెలిసీతెలియనిదాన్ని మీరు ప్రేమించడం మొదలుపెడతారు. ఆ తెలిసీతెలియకుండా ఉండేటటువంటి ఆ స్ఫురణే ఆ మార్మికమైన (మిస్టీరియస్) అంశం, అజ్ఞాతమైన కథ, మిస్టరీ.

## అడ్డంకులు లేని ప్రేమ - *మార్చి 2014*



**భక్తుడు** : గురువుగారూ! మీరు నాకు సహాయాన్ని అందిస్తున్నప్పటికీ నిజానికి నేను ఆ సహాయం తీసుకోనీయకుండా నన్ను ఏదో వెనక్కు లాగుతోంది. అది నాకెంతో బాధను కలిగిస్తోంది. ఎందుకలా జరుగుతోంది?

**గురువుగారు :** నీకు ఎప్పట్నుంచో ఉన్న అలవాటేమిటంటే నీకందుతున్న సహాయాన్ని తిరస్కరించడం. అదే దీనికి కారణం. మన జీవితాలలో ఎదురైన ఎన్నో అనుభవాల వలన మనలో ఇటువంటి ప్రతిబంధకాలు (అడ్డంకులు) తలెత్తుతాయి. అవి ఒక్కొక్కరి విషయంలో ఒక్కోరకంగా ఉంటాయి. మనకు జీవితంలో ఎదురైన కష్టనష్టాలు మనలో ఒక రకమైన భావోద్వేగపు జడత్వాన్ని సృష్టిస్తాయి. సహాయాన్ని పొందనీయకుండా చేసేది మీలోని ఆ జడత్వమే! దీనిని తొలగించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు మీరు ఈ సహాయాన్ని పూర్తిగా అనుభవంలోనికి తెచ్చుకోగలుగుతారు. మీ హృదయాంతరాళాలలో అణువణువూ వెతికి ఆ జడత్వాన్ని తొలగించుకోండి. అది లేకుండా చేసుకోండి! మనస్సు వేసే పిచ్చి పిచ్చి వేషాల బారిన పడకుండా, దానికి ఎర కాకుండా ఉండండి. అప్పుడు మీకు సహాయం అందుతుంది. కానీ మీరు సహాయం అడుగుతున్నారు, ఇచ్చినపుడు దానిని తిరస్కరిస్తున్నారు కూడా! ఈ రెండూ చేస్తున్నారు: అడగడం, తిరస్కరించడం. అడగడం, తిరస్కరించడం. ఇక ముందుకు ఎలా వెళతారు? ఉన్న చోటనే ఉంటారు. దాని వలన మీలో నిస్పృహ పెరుగుతుంది. ఆ నిస్పృహ వలన జడత్వం మరింత పెరుగుతుంది. అది ఒక వలయంలా పునరావృత మవుతూనే ఉంటుంది. అవే మన వాసనలు, అలవాట్లు.

**భక్తుడు** : మరి ఈ వలయం నుండి ఎలా బయటపడగలం?

**గురువుగారు :** అదే నేను చెప్పేది. ముందు మీకున్న జబ్బేమిటో వివరించాను. ఇప్పుడు దానికి మందు తీసుకోవాలి : సహాయం తీసుకోవాలి. సహాయం తీసుకోవడమెలా? సహాయం ఎలా ఉండాలో ముందే నిర్ధారణ చేయకుండా సహాయం తీసుకోవడానికి సిద్ధంగా ఉండండి. సహాయమనేది ఎలా ఉండాలో నిర్ణయించడానికి ప్రయత్నించకండి. అలాంటి ఆలోచనలకు ఇది సమయం కాదు. ఇచ్చిన సహాయాన్ని పూర్తిగా, బేషరతుగా, నిండు మనస్సుతో స్వీకరించండి. దానికి పేర్లు పెట్టడంగాని, దాన్ని అడ్డుకోవడానికిగాని లేకపోతే అంచనా వెయ్యడానికిగానీ ప్రయత్నిస్తున్నట్లు





మీరు గమనిస్తే, అలా చెయ్యడాన్ని ఆపేయండి. లేకపోతే అది అలవాటుని మరింత బలోపేతం చేస్తుంది. ఇలాంటివన్నీ మీకున్న అడ్డంకులతో సహా, మీ హృదయం నుండి రావు, మీకు అలవాటుగా వస్తాయి. ఎందుకంటే మన మనస్సు అలా ఆలోచించడానికి, అలాంటి భావనలకు అలవాటుపడిపోయింది గనుక. అందుకని ఆ ధోరణి అలా కొనసాగుతూ ఉంటుంది. మీవైపు నుండి మీరేదైనా చెయ్యాలనుకుంటే ముందు ఆ అలవాటును మానుకోండి. కానీ ఆ అలవాటును ఎలా మానెయ్యాలి? అది చాలా కష్టమైన పని. అది మీరు కూర్చుని ఉన్న చెట్టుకొమ్మను మీరే నరుక్కోవడం లాంటిది – ఎందుకంటే ఆ అలవాటే మీరు. కాబట్టి ఒక క్రొత్త అలవాటును అలవరచుకోండి. అది మీలో అడ్డంకులు సృష్టించేదిగా ఉండకూడదు. ఈ క్రొత్త అలవాట్లనే అనేక సాంప్రదాయాలలో ఆధ్యాత్మిక సాధనలు అంటారు. కానీ నా దృష్టిలో అవి కూడా అలవాట్లే, అంతకుమించి మరేదీ కాదు. మీకున్న పాత అలవాట్లను దూరం చేసుకోవడానికి క్రొత్త అలవాట్లను అలవరచుకొంటున్నారు. అంతే! అది రమణమహర్షి చెప్పినట్లు "ముల్లును ముల్లుతోనే తీసేయడం" లాంటిది. ఎందుకంటే మన క్రొత్త అలవాటు కూడా ఒక ముల్లే.

**భక్తుడు :** ఆ సహాయానికి 'ఇది ఫలానా' అని ముద్రలు వేయడం, ముందుగానే నిర్ధారణకు రావడం అనే అలవాట్లే మనకు అడ్డంకులా?

**గురువుగారు :** మిమ్మల్ని ముందుకు పోనీయకుండా చేస్తూ మీకు అడ్డంకులు సృష్టించేవేవైనా సరే, వాటిని తొలగించుకోవాలి. అవేవైనా సరే, అవి ఏమిటో, ముందు క్షుణ్ణంగా అన్వేషిద్దాం. నిజంగా అన్వేషించడమంటే అదే! మీ అన్వేషణకు అడ్డుపడేవి మీ పాత అలవాట్లే. మీరు క్రొత్త అలవాట్లేవీ చేసుకోకుండా ఈ పాత అలవాట్లను వదిలించుకోగలిగితే మంచిదే. అలాంటప్పుడు మీకు క్రొత్త అలవాట్లు చేసుకోవాల్సిన అవసరం లేదు. కానీ అది చేయలేనప్పుడు, ఇక క్రొత్త అలవాట్లు చేసుకోవలసిందే.

మీరు సత్సంగానికి వెళ్లడం, పారాయణ, ధ్యానం చేసుకోవడం, సత్సంగాలను అనువదించడం, శిరిడీకి వెళ్లడం ఇవన్నీ క్రొత్త అలవాట్లే. ప్రేమను అనుభూతి చెందుతున్నవారికి ఇవన్నీ వారి ప్రేమకు వ్యక్తీకరణలవుతాయి. వారు వాటిని ఆస్వాదిస్తారు. వాటిని ఆస్వాదించలేనివారికి అవి కేవలం క్రొత్త అలవాట్లు, ఆధ్యాత్మిక సాధనలు అవుతాయి. వాళ్లు దానిని ఎలా తీసుకున్నా నిజానికి అవన్నీ ఒక్కటే. అందుకే అడ్డుకోవడాన్ని ఆపండి, సహాయాన్ని త్రోసిపుచ్చకండి.

**భక్తుడు :** గురువుగారూ! ప్రేమను వ్యక్తం చేయనీయకుండా మాలో ఏదో అడ్డుపడుతోంది. దానిని తొలగించుకోవడానికి ఉత్తమమైన మార్గమేమిటి?

**గురువుగారు :** ఇక్కడ సమస్య అడ్డంకులని నేను అనుకోవడం లేదు. ప్రేమ తాను వ్యక్తం కావాలను కొన్నప్పుడు, అది స్పష్టమైన మార్గాల కోసం తానే వెతుకుతుంది. అటువంటి స్పష్టమైన వ్యక్తీకరణకు మీకు

అవకాశం దొరకనప్పుడు, ప్రేమను వ్యక్తం చేయడంలో మీకు గతంలో ఉన్న అనుభవాలు గుర్తుకువస్తాయి. ఒకవేళ ఆ జ్ఞాపకాలు బాధతోనూ, నిరాశనిస్పృహలతోనూ కూడుకున్నవైతే ఆ భావనలూ తిరిగి వస్తాయి. కాబట్టి ఇక్కడ కావలసింది అడ్డంకులను తొలగించుకోవడం కాదు, మన ప్రేమను ఇంకా ఇంకా స్పష్టంగా వ్యక్తం చేయగల మార్గాలను వెతుక్కోవాలి. మనకు ఎప్పుడైతే అటువంటి మార్గాలు దొరికి మనం ఆ ప్రేమ వ్యక్తీకరణను అనుభవంలోకి తెచ్చుకుంటామో, అప్పుడు అవి నెమ్మదిగా మన పాత జ్ఞాపకాల స్థానాన్ని తీసుకుంటాయి. ఇలా ప్రతి ఒక్కరూ ఎవరి మార్గాలను వారే అన్వేషించుకోవాలి.

**భక్తుడు :** గురువుగారూ! సద్గురువు పట్ల మన ప్రేమను వ్యక్తపరచడంలో – ఆయనకు సంబంధించిన పని చెయ్యడానికి, మౌనంగా కూర్చొని ఆయనను ధ్యానించడానికి మధ్య ఏమైనా తేడా ఉందా?

**గురువుగారు :** మీరు నిశ్చలంగా కూర్చొని ధ్యానం చేసుకోగలిగితే, అది మంచిదే చెయ్యండి. నేనెప్పుడూ దానికి అడ్డుచెప్పను. కానీ ప్రశ్నేమిటంటే, అసలు మీరు అలా చెయ్యగలరా? అలా చెయ్యగలిగితే, నేను దానికే ప్రాధాన్యతనిస్తాను. అలా చెయ్యలేము కాబట్టే మనలో అన్యత్వభావాన్ని, అహంకారాన్ని పెంచేటువంటి, ఆ ప్రేమానుభూతిని లేకుండా చేసేటువంటి రకరకాల పనుల్లో మనం మునిగి తేలుతూ ఉంటాం. అందుకనే మీకు అనుభవమవుతున్న ప్రేమను వ్యక్తపరచడానికి ప్రయత్నించమని చెబుతుంటాను. మీరు ప్రేమను అనుభూతి చెందుతూ, వ్యక్తం చేస్తూ ఉంటే అది మరింత బలోపేతమవుతుంది. అలా మీకు తెలియకుండానే మీలో ఉన్న అడ్డంకులు మెల్లగా బలహీనమై తొలగిపోతాయి. ఎందుకంటే ప్రేమలో మీకంటూ (అహంకారానికి) చోటు ఉండదు. అంతటా మీరు ప్రేమించేదానితో (సద్గురువుతో), దానికి సంబంధించిన వాటితో నిండిపోతుంది. మీరు, "నేనిక్కడ చేస్తున్న పని యొక్క లక్ష్యం ఏమిటి? దీనికి, నా లక్ష్యానికి సంబంధం ఏమిటి? ఇది ఏమి సాధన?" అని విశ్లేషించుకోవడంగానీ, అర్థం చేసుకోవాలనిగానీ ప్రయత్నించవద్దు. ఇటువంటి ప్రశ్నల వలన ఎటువంటి ఉపయోగమూ లేదు. అలా ప్రశ్నించుకోకుండా, చెయ్యండి. అంతే!

నేను ఇలాంటి విషయాలను గురించి మాట్లాడవలసి వచ్చినపుడు కర్మయోగం వంటి పదాలను వాడను. ఎవరినైనా నాకు సంబంధించిన పనులు చేయడానికి సమ్మతించానంటే, దానికి గల ఏకైక కారణం వాళ్ళు ఆ పని చేయడాన్ని ఎంతో ఇష్టపడడమే. అంతే! అదే నాకు కూడా వర్తిస్తుంది. మీ కోసం ఏదైనా చేయడం నాకూ ఇష్టమే. మీరు ఈ పని చెయ్యకుండా ఎలా ఉండలేరో, నేను అలానే మీకు సాయం చెయ్యకుండా ఉండలేను. అక్కడ కారణాలంటూ ఏమీ ఉండవు. "ఇతను ఎంతో యోగ్యుడు, నా కోసం నాలా చేశాడు, నేను ఇతనికి ఏమైనా చెయ్యాలి"... అలా ఎటువంటి లెక్కలు ఉండవు. అటువంటి లెక్కలు వేస్తే అది వ్యాపారం అవుతుంది, ప్రేమ అవ్వదు, నేను వ్యాపారస్తుణ్ణి కాను, నాతో ఎవరైనా అలా వ్యాపారం చెయ్యడాన్నీ ఇష్టపడను.





**భక్తుడు** : గురువుగారూ! నేను పర్వదినాల సందర్భంగా శిరిడీ వచ్చినప్పుడు అక్కడ ఉండే జన సమూహం వల్ల నాలో ఏదో ఇబ్బంది కలుగుతోంది. దీనిని పోగొట్టుకోవడం ఎలా?

**గురువుగారు :** అంతమంది భక్తులు ఒక్కచోటకు చేరినపుడు మన అనుభవం యొక్క గాఢత, శక్తి అధికంగా ఉంటుంది. అందుకే మహాత్ములు ఉత్సవాలకు వెళ్ళడాన్ని ప్రోత్సహించేవారు. శాస్త్రాలూ ఇదే విషయాన్ని చెబుతున్నాయి. ఇతర సమయాలలో (మన సాధన) గాలి లేనప్పుడు సాగే పడవ ప్రయాణంలా ఉంటుంది. కానీ పర్వదినాల రోజులలో, గాలి మనకు అనుకూలంగా వీస్తున్నపుడు తెరచాపనెత్తి పడవమీద ప్రయాణించడంలా ఉంటుంది. ఎందుకంటే ఒకే మనఃస్థితి కలిగిన అంతమందితో కలసి ఉండడం, అందరి హృదయాల్లో సద్గురువే కొలువై ఉండడం వలన కొద్ది ప్రయత్నం చేతనే మీరు అనుభవాన్ని పొందగలుగుతారు. సద్గురు ప్రేమను మనం అనుభూతి చెందడంలో ఉన్న అడ్డంకులన్నీ సులభంగా తొలగిపోతాయి. మీరన్నట్లు మీకు అంతమంది భక్తులను చూస్తే అయిష్టత కలుగుతోంది. అది ఒక అడ్డంకి. ఇది తొలగినప్పుడు మీకు ఆ ప్రేమ ఇంకా బాగా అనుభవం అవుతుంది. మీరు ఆ ప్రేమను బాగా స్వీకరించగలరు, స్పందించగలరు, అనుభవించగలరు. కానీ బాబా వైపు నుండి మాత్రం మీరెక్కడ ఉన్నా ఆయన ప్రేమ, సంరక్షణ మీపై ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటాయి.

**గురువుగారు :** మనలోని అడ్డంకులకు కారణం చిరకాలంగా మనలో పాతుకుపోయిన అలవాట్లు. భగవాన్ తమ మరణానుభవం గురించి చెప్పినపుడు, అంతటి ఆయన కూడా మరణభయం అనుభవించానని చెప్పారు. జరగరానిదేదో జరుగబోతుందని ఆయనకు అనిపించిందట. ఆయన భగవాన్ కాబట్టి ఆ అడ్డంకి (భయం) కొద్ది క్షణాలు మాత్రమే ఉంది. మనకైతే అది కొన్ని సంవత్సరాలు ఉండేదేమో! (నవ్వులు...) ఆ అనుభవం యొక్క లక్షణమైతే అందరికీ ఒక్కటే. కానీ పరిమాణాత్మకంగా చూస్తే అది మారవచ్చు.

మొత్తం మీద, నేను చెప్పదలచుకున్నదేమిటంటే, ప్రేమను వ్యక్తపరచడానికి మీకు మీరే అడ్డంకులు పెట్టుకోవద్దు. ప్రేమ సహజంగా తనంతట తాను వ్యక్తం కావాలనుకుంటున్నప్పుడు, "మనం ఇలా చెయ్యకూడదు, మనం అలానే చెయ్యాలి, ఇలాగే కూర్చోవాలి, ఇలాగే మాట్లాడాలి" లాంటి సిద్ధాంతాలతో ఆ ప్రేమను అణగద్రొక్కవద్దు. ఇలాగే ఉండాలనికానీ, ప్రేమను ఈ పద్ధతిలోనే వ్యక్తపరచాలనిగానీ ఎలాంటి నిబంధనలూ లేవు. కనీసం మీ ప్రేమను వ్యక్తం చేయడంలో ఉన్న అడ్డంకులనైనా తొలగించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు మీ వ్యక్తీకరణ మరింత సహజమై, సంపూర్ణమై కొద్దికాలానికి అది మిమ్మల్ని పూర్తిగా సొంతం చేసుకొంటుంది.

**గురువుగారు :** చాలామంది విషయంలో సాధారణంగా ఏం జరుగుతుందంటే, వారిలో ప్రేమ జనించినపుడు వారు శాస్త్రగ్రంథాల నుండి, ఇతర పుస్తకాల నుండి నేర్చుకున్న పదాలతోనో, భావాలతోనో ఆ అనుభూతికి ఒక పేరు పెట్టి దానిని పోగొట్టుకుంటారు. అందుకనే నేను దానికి ప్రత్యేకంగా ఒక పేరంటూ పెట్టను.

నేను దానిని, ప్రేమ, బాగా తెలిసీ తెలియనట్లుండే భావన, ఒక తెలియని ఆకర్షణ, మన బుద్ధికి అంతుపట్టని భావన అంటాను. (గురువుగారు నవ్వుతూ...)

నేను చాలా మంది వద్ద గమనించేది ఏమిటంటే – ముఖ్యంగా పాశ్చాత్యుల్లో – (గురువుగారు నవ్వుతూ...) వారికి ఇక్కడ చిక్కుకుపోతామేమోనని, వారి ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని కోల్పోతామేమోనని ఒక భయంఉంటుంది. ఆ భయమే వారిలో అడ్డంకులు కలుగజేస్తుంది. అయితే ఆ విషయం వాళ్ళకు తెలీదు.

**భక్తుడు** : గురువుగారూ! నాలోని భక్తి ప్రజ్వరిల్లి మరింత తీవ్రమవ్వాలని కోరుకుంటున్నాను. దీని కోసం నేనేం చేయాలి?

**గురువుగారు :** ముందు, మనకు ఏం కావాలి అనేది తెలుసుకోండి, ఏమి చేయాలనేది తరువాత విషయం. ఎక్కువగా అందరూ లక్ష్యాన్ని ప్రేమిస్తారు, దాంట్లో సందేహమే లేదు. కానీ దాన్ని చేరడానికి “అయ్యో, నాలో చాలా అడ్డంకులు ఉన్నాయి కదా” అంటుంటారు. ఆ అడ్డంకులేమిటి? అని ఒక్కసారి వాటి గురించి ఆలోచించి చూడండి. ఎంత అర్థం పర్థం లేనివో తెలుస్తుంది. వారికి మోసపోతామేమోనని భయం, మనలను వాడుకుంటారనే భయం, దేనిలోనైనా చిక్కుకుంటామేమోనని భయం, లేదా ఇంకా ఇంకా కూరుకుపోతామేమోనని భయం. “మరీ దగ్గరవుతున్నామేమో, అది మంచిది కాదు, కొంచెం దూరం ఉంటేనే మంచిది” అనుకొంటారు. మరీ దగ్గరైతే ఏమవుతుంది? వాడుకుంటారా! అసలు ఎవరైనా వాడుకునేదానికి మీలో అంత విషయమేముంది? మీలో నిజంగా అంత ఉంటే మీకు ఇక్కడకు వచ్చి కూర్చోవలసిన అవసరమే లేదు. మీకు ఈ మార్గం నచ్చింది కాబట్టి ఇక్కడకు వస్తున్నారు. మీకు సహాయం అవసరమైతే ఇక్కడ సహాయం అందుతుంది, లేకపోతే లేదు. అలా కాకుండా, మీకు ఇంతకంటే మంచి మార్గం తెలిస్తే సంతోషంగా వెళ్లి ఆ మార్గాన్ని ఎన్నుకోండి. అది ఏదైతేనేం, చెయ్యండి చాలు. మరీ దగ్గరవుతామేమో, ఇరుక్కుపోతామేమోననే భయం ఉంటే ప్రయోజనం లేదు. కొంతమంది నా దగ్గరకు వచ్చి, “మీరంటే నాకు చాలా ప్రేమ గురువుగారూ! నేనెప్పుడూ మీతో ఉండాలనుకొంటున్నాను. కానీ ఏం చెయ్యను? నాకు ఎన్నో అడ్డంకులున్నాయి. ఎన్నో వాసనలున్నాయి” అని అంటారు (నవ్వులు...) చిక్కుకు పోవడం, వాసనలు : వారు ఈ రెండు పదాలు బాగా నేర్చుకొన్నారన్నమాట.

మీరు నన్ను ప్రేమిస్తున్నట్లయితే, మీకు నిజమైన ప్రేమే ఉంటే, ఆ ప్రేమ అత్యుత్తమమైన ప్రేమ అయితే – ఆ ప్రేమ, “రండి, వాడుకోండి! నన్ను ఎలాగైనా ఉపయోగపెట్టుకోండి” అని అంటుంది. ఇంతకుముందు కూడా నేను మీకు ఈ మాట చాలాసార్లు చెప్పాను, మీరు నన్ను ఉపయోగించుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నానని! రండి, నన్ను ఉపయోగించుకోండి, ఉపయోగ పడటానికి నాకు ఎలాంటి భయమూ లేదు. (నవ్వులు...) మీకేగనుక సామర్థ్యముంటే, ధైర్యం ఉంటే, నన్ను ఉపయోగించుకునే సమర్థత ఉంటే పూర్తిగా ఉపయోగించుకోండి.





నేను దానిని ఎంతో ఇష్టపడతాను.

కాబట్టి మీరు దానిని అర్థం చేసుకుంటే – ఈ 'చిక్కుకుపోతాం' అనే భయం ఎంత వె(ర్రిగా, అర్థరహితంగా ఉంటుందో తెలుస్తుంది. ఎంతో కొంత నిమగ్నమవ్వకపోతే పరివర్తన ఎలా చెందుతాం? ఏమీ చెయ్యకపోతే పరివర్తన ఎలా వస్తుంది?

**భక్తుడు** : నా హృదయం తెరచుకునే క్రమంలో, గతంలో నాకు ప్రేమ వల్ల కలిగిన పాత గాయాల మచ్చలు కనిపిస్తున్నాయి. ఆ జ్ఞాపకాలు నన్ను వెనుకకు లాగుతున్నాయి. బాధ కలిగించే ఆ గుర్తులు తొలగిపోవాలని ప్రార్థిస్తూ, ఊరకే ఇలా వేచి ఉండాలా?

**గురువుగారు :** నీ హృదయం తెరచినపుడు మొదట నీకు ఆ పాత గాయాల గుర్తులు కనిపిస్తాయి. వాటిని ఎలా తొలగించుకోవాలి? ఎలా నయం చేసుకోవాలి? ప్రేమే దానికి మందు. అదే వాటిని నయం చేస్తుంది.

**భక్తుడు** : ఆ ప్రేమను ప్రేరేపించేది సద్గురువా?

**గురువుగారు :** అవును, మీ హృదయాన్ని తెరచి, మీలో ఆ ప్రేమను ప్రేరేపించిన ఆయనే మీకు ఓపెన్ హార్ట్ సర్జరీ కూడా చేస్తారు. (గురువుగారు నవ్వుతూ...) మీ హృదయాన్ని తెరవడం మీ పని కాదు, ఎందుకంటే మీ హృదయాన్ని మీరే తెరచి ఓపెన్ హార్ట్ సర్జరీ చేసుకోలేరు కాబట్టి.

కాకడ ఆరతిలో మొదటి కీర్తనలో (తుకారాం మహరాజ్‌చే రచించబడిన) ప్రేమకు, దానికి కావలసిన అర్హతకు గల సంబంధాన్ని వ్యక్తీకరించారు. అందులో తుకారాం మహరాజ్, "ఓ పాండురంగా, నా ప్రాణమా! నా హృదయంలో నీ పట్ల ప్రేమ ఉందో లేదో నాకు తెలియదు" అంటారు. అంటే ఆయనకు తన హృదయంలో ఉన్నటువంటిది ప్రేమో కాదో తెలియదు. ఆయన అర్హుడో, అనర్హుడో కూడా తెలియదు. ఆయనకు తన స్వామి నామాన్ని గుర్తుపెట్టుకోవడమెలాగో తెలియదు, అసలు తను చెప్పేవి పిచ్చిమాటలో ఏమో కూడా తెలియదు. ఆయన తమ సద్గురువును, "నేను ఎవ్వరైనా సరే, నా అర్హతానర్హతలు ఏవైనా సరే, నేను మిమ్మల్ని ప్రేమించినా, ప్రేమించకపోయినా సరే, మీ దయార్ద్రదృష్టి నా పైన ప్రసరించండి. మీ ప్రేమను నాకు ఇవ్వండి!" అని వేడుకుంటున్నారు. నువ్వు నన్ను ప్రేమించగలవా అని ఆయనను అడగటం లేదు. అలా కాకుండా, నీ ప్రేమను నాకు ఇవ్వు అని అంటున్నారు.

కాబట్టి, మీ హృదయంలో నిజమైన ప్రేమ జనించినపుడు మీ అర్హతానర్హతలకు చోటు ఉండదు. మీకు ఆ ప్రేమ మీద హక్కు ఉన్నట్లు అనిపిస్తుంది. ఆయన ప్రేమను మనకు అందించేది మన అర్హత కాదు, ఆ ప్రేమను ఇవ్వగలిగినటువంటి ఆయన సమర్థత అది. అప్పుడు అర్హతకు సంబంధించిన మన దృక్కోణం పూర్తిగా మారుతుంది. మనకు అర్హత ఉంది కాబట్టి మనం సద్గురు ప్రేమను పొందటం జరగదు. ఆయన దయామయుడు, ప్రేమ స్వరూపుడు కాబట్టి మనకు ఆ ప్రేమనిస్తారు. **మన అర్హత మీద నుండి ఆయన సామర్థ్యం మీదకు దృష్టి మరల్చండి. అది చాలు.**

# ఎదుటివారి స్థానంలో నిలబడి చూడు!

**ఆత్మౌ పమ్యేన సర్వత్ర సమం పశ్చతి యోవర్జున సుఖం వా యదివా దుఃఖం సయోగీ పరమో మతః**

తోటివారిని సాటివారుగా చూడాలి! వారూ తనలాంటి వారేనని గ్రహించుకోవాలి. కష్టసుఖాలలో వారి స్థానంలో మనం నిలబడి చూడాలి. అప్పుడు వారుగా ఉన్నది కూడా మనమేనని అనుభూతమవుతుంది. వారి కష్టసుఖాలలో పాలుపంచుకొన గలుగుతాం. ధన్యత చెందుతాం. ఎదుటివారి స్థానంలో మనం నిలబడి చూసినపుడు, ఆ స్థానంలో మనని మనం ఊహించుకున్నపుడు పరిస్థితి యొక్క నిజస్వరూపం మనకు బోధపడుతుంది. మన కర్తవ్యం పట్టాలను దాటకుండా సాగుతుంది. అంటే ధర్మాచరణ మనేది అలవోకగా సాధ్యమవుతుంది. ఆ ధర్మం మన నుండి జరగమన్నా జరగదు. ఎందువల్లనంటే ఏది ఏమిటి అన్నది మనకు తెలుస్తూనే ఉన్నది కదా. తెలియక పోయినపుడు కదా మనం దారితప్పేది, ఇది ఒక చిత్రమయిన సాధన. ఈ సాధన మానవుణ్ణి పరిపూర్ణుణ్ణి చేస్తుంది. ఎదుటివారిని వేరుగా చూడకూడదు. వారి స్థానంలోనూ మనమే నిలబడాలి. అప్పుడు మనస్సునకు అంటేదే ధర్మం. (అందుకే మనవైపునుండి గాక ఎదుటివారి వైపు నుండి ఆలోచించాలి అంటారు శ్రీబాబూజీ).

కష్టంలోనూ, సుఖంలోనూ కూడా మనం ఇలాగే భావించుకోవాలి. అప్పుడు నిజంగా ఏది కష్టమో, ఏది సుఖమో తెలుస్తుంది. మనకు ఏది కష్టమో తెలుస్తుంది కనుక ఎదుటివారిని కష్టపెట్టము. మనకు ఏది సుఖమో తెలుస్తుంది కనుక ఎదుటివారిని కూడా సుఖపెడతాము. కష్టసుఖాలు అందరికీ ఒక్కటే. అసలందరుగా ఉన్నది ఆ ఒక్కడే కదా. అంతవరకూ వెళుతుంది ఈ మన అనుభూతి. చూసారా, ఒక మంచి భావన మానవుణ్ణి ఎంత ఉద్ధరిస్తున్నదో, ఎదుటివారి స్థితిలో మనని మనం ఊహించుకుందాం అన్న భావన మానవుడికి ఎంతటి ధన్యతను అందిస్తున్నదో చూసారా!

ప్రక్కఇంటిలో అమ్మాయి నొప్పులు పడుతున్నది. వాళ్ల ఇంటిలోని వాళ్లు గాబరా పడుతున్నారు. అది అర్ధరాత్రి. రవాణాసౌకర్యం కష్టం. ఇవతలి ఇంటాయనకి కారు ఉన్నది. కారు గ్యారేజీలోనే ఉన్నది. కండీషన్‌లోనే ఉన్నది. కాని అతనే కండీషన్‌లో లేడు. అతనికి మెలకువ వచ్చింది. ప్రక్క ఇంటిలోని హడావుడి చూస్తున్నాడు. వారి అవసరం అతనికి తెలుసు, కాని కదలడు, "కొంపదీసి కారు అడగరు కదా, వీళ్ల కోసం రాత్రి పూట వెళ్లిరావాలి, పెట్రోలు ధరలు చూస్తేనా మండిపోతున్నాయి, డబ్బులు వాళ్లనేమని అడుగుతాం? ఈ గొడవంతా ఎప్పుడొస్తుంది. మనం సహకరిస్తే కదా! వారొచ్చి అడిగితే కారు చెడిపోయింది అని చెబితే సరిపోలే. ఇక నిశ్చింతగా పడుకోవచ్చు. ఏమిటో ఇవన్నీ లేనిపోని ఆబ్లిగేషన్స్. ఒక్కొక్కపుడు సౌకర్యాలు ఉండటం కూడా తప్పే. అందరి కళ్లు ఇటే ఉంటాయి" అనుకుంటూ నిద్ర నటిస్తున్నాడు. ఇంతలో తలుపు చప్పుడయింది. వాళ్లు హడావుడి పడుతున్నారు. అర్ధిస్తున్నారు. వాళ్ల కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. వాళ్ళు నిస్సహాయులయి ఉన్నారు. కాని ఇతని దగ్గర సమాధానం సిద్ధంగా ఉంది. 'కారు చెడిపోయింది' అన్నాడు. వారి కన్నీరు అతని కారును కదపలేకపోయాయి. వారు వెనుదిరిగారు. చిమ్మచీకటిలో అటు, ఇటు తడుముకొంటూ అయోమయంగా నలుగురు నాలుగువైపులకు పరుగెత్తుతున్నారు, ఎవరయినా, ఏమయినా చేయగలరేమోనని, **అతడు తలుపులు వేసుకొన్నాడు. ఇంటికే కాదు, మనస్సుకు కూడా!**

అతడు వారి స్థానంలో నిలబడలేకపోయాడు. వారి బాధ అతనికి బోధపడలేదు, వారిది వారికే. తనకేమిటి అనిపించింది. వారి బాధ తన బాధ కాదా! తనకూ అలాంటి అవసరమొస్తే, అప్పుడు ఆ ప్రక్కింటివారూ ఇలాగే ప్రవర్తిస్తే అతనికి ఏమనిపిస్తుంది? తట్టుకోగలడా? మరి ఈ సంగతి అతడు ఆలోచించాడా?





ఒక గుమస్తా తన భార్యను వెంటబెట్టుకొని తెలిసినవారి కారడిగి తీసికొని సంతోషంగా తన ఆఫీసరు ఇంటిముందు దిగాడు. దిగి నమస్కరించాడు. నమస్కరిస్తూ చేతికి ఒక ఆహ్వానాన్ని అందించాడు. 'మీవంటి పెద్దల దయవల్ల, దైవానుగ్రహం వల్ల నేనొక ఇంటిని కట్టుకోగలిగాను. ఆ ఇంటి గృహప్రవేశం. మీరు సపరివారసమేతంగా తరలిరావాలి. మీరొస్తే మాకు నిండుదనం. మీరొస్తే అది మాకొక పండుగ' అంటూ మరింత సంతోషాన్ని వెలిబుచ్చాడు. 'అలాగే, దానికేమిటి, తప్పకుండా! ఏమాత్రం వీలున్నా అందరం వచ్చేస్తా'మంటూ సాగనంపాడు. సాగనంపి, వెనుదిరుగుతున్న అతనికి ఏ మాత్రం సంతోషంగా లేదు. ఏమిటోగా ఉంది. "ప్రతివాడూ ఇల్లు కట్టేవాడే ఇలా చూస్తుంటే అలా కట్టేస్తున్నారు. ఎవరో కట్టడం వేరు. మరీ తన క్రింద గుమస్తా! వీడూ ఇల్లు కట్టేవాడేనా! కట్టాడే అనుకో, అంత సంబరపడిపోవాలా! ఆ సంబరంలో తాను కట్టాను అన్నదానికి సంతోషం కన్నా, నేను ఇంకా కట్టుకోలేకపోయాను అన్న వెక్కిరింత కనబడుతోంది. వాడికి ఇల్లు కట్టడం ముఖ్యం. కట్టుకొన్నాడు, నేను దానికంత ప్రాధాన్యం ఇవ్వలేదు. అందుకని కట్టలేదు. నేను ఇప్పటికే కట్టేశాను' అన్నట్లు చూస్తున్నాడు. నిజంగా ఆ చూపులెంత దుర్భరంగా ఉన్నాయి. గుమస్తాపాటి చేయలేక పోయావు. అన్నట్లుగా లేవూ? ఆఫీసులో ఇవ్వొచ్చుకదా ఆహ్వానం! పనిమాలా ఇంటికి వచ్చి మరీ ఇచ్చాడు. ఇంట్లో వాళ్లకి కూడా నేను దొరికిపోవాలి అన్నట్లు. ఏమి జాణతనం! పైగా సపరివారంగా రావాలట! అంటే పని వాళ్లకి కూడా నేను దొరికిపోవాలన్నమాట! ఏం పిలుపు? పైకి పిలిచినట్లే కనిపిస్తున్నాడు. లోపల నన్ను దొలిచేస్తున్నాడు.

అతనికి ఏమీ తోచడం లేదు. తొలచబడుతున్న వానికి ఇక తోచేదేమిటి? ఏమీ పాలుపోవడం లేదు. ప్రేమపాలు తగ్గినవానికి ఇక పాలుపోయేదెక్కడ? పిచ్చెత్తినట్లవుతోంది. సహించలేనిస్థితిలో అంతకన్నా ఒరిగేదేమిటి? అతడు భరించలేకపోతున్నాడు. దేనిని భరించలేకపోతున్నాడు? ఎదుటివాడు సుఖంగా ఉండటాన్ని భరించలేకపోతున్నాడు. ఎంత ఆశ్చర్యం? అతని బాధ తాను ఇల్లు కట్టుకోనందుకు కాదు. గుమస్తా ఇల్లు కట్టుకొన్నందుకు! విచిత్రంగా లేదూ!

నిజానికి తన తోటివాడు ఒక ఇల్లు కట్టుకొన్నాడూ అంటే ఎంత సంతోషంగా ఉంటుంది. మరి, ఇక్కడ ఇదేమిటి? అదే లోక విచిత్రం. ఎదుటివాని స్థానంలో తనను తాను నిలుపుకొన్నప్పుడుగాని ఈ దుస్థితులూ, దుర్భరస్థితులూ తొలగిపోవు.

అంటే సహృదయుడూ సజ్జనుడయిన వానికి ఏమనిపిస్తుంది. తానే ఇల్లు కట్టుకొన్నంత సంబరం కనిపిస్తుంది. కౌగిలించుకొని మనసారా అభినందిస్తారు. వెళ్లి కార్యక్రమానికి ఆధ్వర్యం వహిస్తాడు. తనదే అదంతా అన్నట్లుగా సంబరపడిపోతాడు. తన తోటివాడు తనవాడుకాడా! వాడిలో తానులేడా? నిజానికి తానే వాడు కాడా? ఇలా ఉంటుంది ఆ అనుభూతి అమృతప్రదంగా ఉంటుంది. అమృతాన్ని వర్షిస్తుంది. ఇక్కడ సహృదయుడు ఏం చేస్తున్నాడు? తనను ఎదుటివాని స్థానంతో నిలుపుకొంటున్నాడు. తానే అతనై ఆనందిస్తున్నాడు. ఆ స్థితి మనకు అందాలి. కష్టసుఖాలలో తోటివారితో మనం అలా ప్రవర్తించగలగాలి! అప్పుడు ఒకరికొకరు తోడుగా ఉండ గలుగుతారు. అది చేతనయ్యేంతవరకూ ఒకరినొకరు తోడుతూ ఉంటారు. అంటే వాడు అలా, వీడు ఇలా అని ఎంచుతూ ఉ ంటారు. సాధనలో ఇది వదిలిపోయి వాడిలా, వీడిలాగాక అందరూ మనలా కనబడే మంచి రోజు రావాలి! మనమే అంతటా నిలవాలి! కష్టసుఖాలన్నీ మనవే కావాలి! అనగా అంతర్యామిస్థితితో నిలబడాలి! అలా నిలబడితేనే నరజన్మకు సార్థకత! అదే నరజన్మకు పరమావధి.

– పార్థసారధి ప్రవచనాలు

అయితే, బాబా  అసలు గురుపూర్ణిమను ఎందుకు చెప్పారు ఇన్ని పండుగలు ఉండంగా? ఒకసారి గురుపూర్ణిమకు మామూలుగా అందరూ పట్టించుకోనట్టుగానే అక్కడ ఉండేటువంటి భక్తులు కూడా ఎవరూ పట్టించుకోలేదు. అప్పుడు దాదాకేల్కర్ అనే భక్తుడిని పిలిచి కేకలేసారు. మామూలుగా కూడా చెప్పటం కాదు, మంచిది చేసుకోండి అని కూడా చెప్పడం కాదు. "నీకీరోజున గురుపూర్ణిమ అని తెలియదా? గురువుకు పూజ చెయ్యాలని తెలియదా? అదిగో పొయ్యి ఆ స్థంభాన్ని పూజ చేసుకో" అన్నారు. ఎందుకు చెప్పారు బాబా? 'గురుపూర్ణిమ' యొక్కప్రాశస్త్యం ఏమిటి? ఇట్లా ఆధ్యాత్మికంగా మనకు ఉపయోగపడేటువంటి పండుగలు మన గమ్యానికి మనల్ని త్వరగా తీసుకుపోయే దానికి వాలుగా ఆ వైపుకి గాలి వీచేటువంటి దినాలు కొన్ని ఉన్నాయి. ఈ రోజున ఏమౌతున్నది. **గురువు యొక్క పూర్తి అనుగ్రహం, జ్ఞానమనేటువంటి వెన్నెల మన మీద పూర్ణంగా వర్షిస్తుంటుంది. గాలి వాటంగా కొడుతున్నది. మనం ఏమి చెయ్యాలంటే, తెర చాప ఎత్తాలి. ఎత్తితే ఒక అడుగు ఇంకా ముందుకు పోతాం. గురువు యొక్క స్వరూపం ఏమిటయ్యా అంటే మనస్సు అంతర్ముఖం కావటం, బాహ్యముఖం కావటం, ఈ రెండింటికీ మధ్య ఉండేటు వంటి సంధి. ఒక్కసారిగా మనం ఏ పాయింట్ నుంచి అంతర్ముఖం? ఏ పాయింట్ నుంచి బహిర్ముఖం? అనే విషయాన్ని గురించి చూసుకున్నట్లయితే ఆ పాయింటే "గురువు".**

ఒక్క అడుగు అవతల ఉంటుంది. ఒక అడుగు ఇవతల ఉంటుంది. కాబట్టి ఈ రెండూ కూడాను మనకు గురుపూర్ణిమ రోజున కనిపిస్తాయి. సరే, బాబా చెప్పారు ఏమని? 'ఈ రోజు గురుపూర్ణిమ. నువ్వు గురువును పూజ చేసుకో' అంటూ ఒక స్తంభాన్ని చూపించి, "ఈ స్తంభాన్ని పూజ చేసుకో" అన్నారు. 'నన్ను' పూజించు అని చెప్పలేదు. దానికి కారణమేమిటనంటే మొట్టమొదట ఏ గురువు కూడాను తనను గురువుగా భావించుకోడు, ఒకటి. చెప్తే చెప్పారు.. లేకపోతే ఇంకేదో... ఎదురుగా అగ్నిహోత్రం ఉంది కదా, ధుని ఉంది కదా, ధునిని పూజ చేసుకోమని ఎందుకు చెప్పలేదు? స్తంభాన్ని చూపించి స్తంభాన్ని పూజ చేసుకోమని ఎందుకు చెప్పారు? అని అంటే, ఈ మొత్తం ఆధ్యాత్మికం అనేటువంటి మొత్తం మార్గానికంతా కూడాను మూలస్థంభం లాంటివారు 'గురువు'. ఈ స్థంభం మీదనే ఈ ఆధ్యాత్మిక సౌధం అంతా కూడా కట్టబడి ఉంటుంది. ఆ 'కృప' లేకపోతే, ఆ యొక్క పట్టు లేకపోయినట్టయితే మొత్తం సౌధమే కూలిపోతుంది. కాబట్టి ఆ సౌధాన్ని, ఆ స్తంభాన్ని గుర్తించు, ఆ స్తంభాన్ని పూజ చేసుకో, మనలను మూలంగా మన యొక్క చైతన్యాన్ని నిలబెట్టేటువంటి చైతన్యమనేటువంటి స్థంభాన్ని గుర్తుంచుకో, దాన్ని పూజ చేసుకో.



-శ్రీబాబూజీ



సద్గురుని గుణగానమే - **భజనము**

గురులీలల మననమే - **నిత్య పారాయణము**

అనంతమైన కరుణే - **స్మరణము**

మహనీయులు మనకొసగిరీ **ఉపాయము**

– గురుకృప